RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 12 ఆగస్ట్ 2025 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:61

## రాహుల్ గాంధీ అరెస్ట్.. ఢిల్లీలో హైటెన్షన్



పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు.

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా పలువురు కీలక నేతలను అరెస్టు చేశారు. ప్రత్యేక బస్సుల్లో వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అరెస్టుల నేపథ్యంలో ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది.

లోక్ సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచేందుకు ఈ రోజు విపక్ష కూటమి ఎంపీలంతా ర్యాలీ చేపట్టారు.

పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ నిర్వహించేందుకు తలపెట్టగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు.

సంసద్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. భేటీకి 30 మందికి అనుమతిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించగా.. అందరం కలిసే వెళతామని ఇండియా కూటమి ఎంపీలు పట్టుబట్టారు. పోలీసులు అడ్డుగా పెట్టిన బారికేడ్లు ఎక్కి అవతలకు దూకి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నిర్మాతలు, ఫెడరేషన్ సభ్యులు ఇరువైపులా పట్ట విడుపు ఉండాలి



హైదరాబాద్:రాష్ట్రరోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ రోజు సచివాలయంలో సినిమా నిర్మాతలు, వివిధ సినిమా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సినీ కార్మికుల సమ్మె కారణంగా షూటింగ్ లు నిలిపివేయబడినందున పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి వివిధ సంఘాల సభ్యులను కోరారు.

సినిమా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీ అన్ని పక్షాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. బుధవారం నుండి షూటింగ్స్ పునఃప్రారంభమవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని మంత్రి పునరుద్ఘాటించారు. సినిమా మరియు వినోద రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో అందమైన ప్రదేశాలు ఉండటంతో అవి ఉత్తమ సినిమా షూటింగ్ లొకేషన్లుగా ఉపయోగించవచ్చని చెప్పారు. ఇది స్థానిక ప్రజలకు ఆదాయాన్ని కల్పించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా పెంచుతుందన్నారు.

సినిమా కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది. అదే సమయంలో సిని పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు. అయితే సమ్మెకు వెళ్లడం సరైన మార్గం కాదని స్పష్టం చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పేద సినిమా కార్మికులకు ఇళ్లు ఇవ్వాలని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో సానుకూలంగా ఉన్నారని మంత్రి చెప్పారు.

ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ అన్ని పక్షాల మధ్య ఐక్యత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ చర్యలను బలపరిచేలా అందరూ కలసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, వివిధ సినిమా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో సబ్ స్టేషన్లకు శంకుస్థాపన, రేషన్ కార్డులు, రైతులకు ట్రాన్స్ఫార్మర్ల పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో సబ్ స్టేషన్లకు శంకుస్థాపన, రేషన్ కార్డులు, రైతులకు ట్రాన్స్ఫార్మర్ల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పీచ్‌మాట్లాడుతూ. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి, spdcl సిఎండి ముషారఫ్ ఫారుకి,కాంగ్రెస్ నాయకులు భీమ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు డిమాండ్ ఎంత ఉన్నా... నాణ్యతతో సరఫరా చేస్తున్నాము

గ్రీన్ పవర్ ఉత్పత్తికి భారీ ప్రణాళికలు

పన్ను భారం మోపకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం

భవిష్యత్ తరాల కు మేలు చేసే విధంగా విద్యుత్ ఉత్పాదనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అందులో భాగంగా గ్రీన్ ఎనర్జీ ఏర్పాటు దిశగా ప్రభుత్వం పడివడిగా అడుగులు ముందుకు వేస్తుంది.

2047 నాటికి పెరిగే డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలపైన సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నాం.

అందుకు సంభందించిన సమాచారన్ని పంపాలని ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసాం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు, రెసిడెన్షియల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో వందకు వందశాతము సౌర విద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాన్ని చేపడుతున్నాం. అందుకు సంబంధించిన సమాచారాన్ని వారం రోజుల్లో పంపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసాం.

దేవాదాయ, ఇరిగేషన్ , మరే ఇతరమైన ప్రభుత్వ భూములు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా ఖాళీగా ఉంటే వాటి సమాచారాన్ని పంపించాలని అధికారులను ఆదేశించాం. ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతోపాటు అక్కడ సోలార్ విద్యుత్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భారీ మధ్య తరహా ప్రాజెక్టులపై కూడా ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పాదన చేసే విధంగా ముందుకు వెళు తున్నాం.

ఇందుకు సంబంధించిన సమాచారం కోసం ఇప్పటికే నీటిపారుదల శాఖకు విద్యుత్ శాఖ లేఖ రాయడం జరిగింది.

హైడల్, పంప్డ్ స్టోరేజ్, పవన విద్యుత్ ఉత్పాదనకు సంబంధించి ప్రణాళిక రూపొందిస్తున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకి విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. విద్యుత్ ఉత్పాదన చేయడం ఒక భాగమైతే.. విద్యుత్ ను సరఫరా చేయడం మరో భాగం.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను అనుగుణంగా సరఫరా లోడ్ ని నియంత్రించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ లను పెంచుకోవడం, అప్ గ్రేడ్ చేయడం, ట్రాన్స్ఫార్మర్లను పెంచుకోవడం చేస్తున్నాం.

అందువల్లనే డిమాండ్ ఏ స్థాయిలో ఉన్న ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించగలిగాం.

రెప్పపాటు కాలం పాటు విద్యుత్ పోకుండా చూస్తున్న విద్యుత్ శాఖ అధికారులు అందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నా.

ఈ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు సింగరేణిలో మాదిరిగానే కోటి రూపాయల ప్రమాద భీమా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

చేవెళ్ల నియోజకవర్గంలో ఒకేసారి రూ. 20 కోట్లకు పైబడిన నిధులతో నిర్మించతలపెట్టిన మూడు 33/11 కేవీ సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంఖుస్థాపన చేశారు. ఈ నియోజకవర్గానికి 5 షబ్ స్టేషన్లు మంజూరుచేస్తే.. ఇప్పటికే రెండు షబ్ స్టేషన్ల పనులు కొనసాగుతున్నాయి.

స్థానిక అవసరాలు, పరిస్థితుల దృష్ట్యా 132 కేవీ సబ్ స్టేషన్ కు ఏర్పాటుకు అవసరమైన డిమాండ్ ను స్టడీ చేసి నివేదికను విద్యుత్ అధికారులు వెంటనే పంపాలి.

అనుమతులు మంజూరు అయిన తరువాత ఇక్కడే 132 కేవీ షబ్ స్టేషన్ కు భూమి పూజ కూడా చేసుకుందాం.

దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్నబియ్యాన్ని అందిస్తున్నాం. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున కార్డులో ఎంతమంది ఉంటే ఎంతమందికి సన్నబియ్యాన్ని అందిస్తున్నాం.

మార్కెట్లో సన్న బియ్యం కిలో రూ.50కి పేజిక్ ధర్క్ ఉంటే.. మన ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. రాష్ట్రంలో 95 లక్షల కుటుంబాలకి ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుంది.

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేసింది.

ప్రజల ఆలోచనని వారి అవసరాలని అజెండాగా పెట్టుకొని ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది.

కొత్తగా ఎక్కడ పన్నులు వేయకుండా మనకున్న ఆదాయంతోనే ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది.

ఇండియా కూటమి ఎంపీల అరెస్టుపై ఎంపీ మల్లు రవి ఆగ్రహం..

వార్త 2 లో

## ఖర్గే, రాహుల్, ప్రియాంక, ఎంపీ ల అరెస్ట్ అక్రమం… అప్రజాస్వామిక చర్య

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** ఓట్ల చోరీ పై ఆధారాలతో సహా నిరూపించి దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎంపీ లు ప్రియాంక గాంధీ ఇండియా కూటమి ఎంపీలను ప్రధాని మోడీ సర్కారు ఢిల్లీలో అరెస్ట్ చేయడాన్ని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సంఘాన్ని కలిసి ఓట్ల చోరీ పై వినతి పత్రం ఇస్తామని శాంతి యుతంగా వెళ్తున్న ఎంపీలను అరెస్ట్ చేయడం అక్రమమని, అప్రజాస్వామ్యమని ఆయన అన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేసి ఓట్ చోరీ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## జూబ్లీ హిల్స్ బస్తీల్లో మేయర్ గద్వాల విజయలక్ష్మి పర్యటన



**జూబ్లీ హిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని జూబ్లీ హిల్స్ సర్కిల్ అంబేద్కర్ నగర్, ఉదయ్ నగర్ బస్తీలలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఉదయం క్షేత్ర పర్యటన.

వర్షకాలంలో సీజనల్ వ్యాదులు రాకుండా బస్తీల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కి మేయర్ ఆదేశం.

బస్తీల్లో వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం చేసే పారిశుధ్య సిబ్బంది పై చర్యలు తప్పవు.

బస్తీల్లో నిర్మాణ వ్యర్థాలు ఇష్టారీతిన పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశం.

అంబేద్కర్ నగర్ నాలా రక్షణ వాల్ కూలిన చోట వెంటనే ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలి.

అంబేద్కర్ నగర్ , ఉదయ్ నగర్ లో రోడ్ల వెంబడి వేసిన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలా అధికారులు చూడాలి

ప్రజాబలం

12 ఆగస్ట్ 2025 మంగళవారం

# అంతరిక్ష రంగంలో భారత్ నేపథ్యం

“విక్రం సారాభాయ్ ని భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడిగా” అభివర్ణిస్తారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించినపుడు శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధాన మంత్రి అయిన నెహ్రూకు వివరించి, 1962లో, భారత అణుశక్తి వ్యవస్థ పితా మహుడయిన హోమీ భాభా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్‌ను ఏర్పరచాడు విక్రం సారాభాయ్. కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయం చేయడం మొదలు పెట్టారు. అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తి స్థాయి రాకెట్లను తయారు చేసి, ఉపరితల అధ్యయంలో పురోగతి సాధించింది. ఉపగ్రహాలను తయారు చేయడమే కాకుండా వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్, ఉపగ్రహ వాహకనౌక రూపకల్పన మొదలు పెట్టాడు. అలా తయారైనదే సెటిలైట్ లాంచ్ వెహికిల్. ఇస్రో తయారు చేసిన తొలి పూర్తిస్థాయి ఉప గ్రహానికి భారత గణిత, ఖగోళ శాస్త్రవేత్త అయిన “ఆర్యభట్ట” పేరు పెటారు. భారత దేశపు మొట్ట మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను 1975 ఏప్రిల్ 19న అప్పటి సోవియట్ యూనియన్ నుండి విజయ వంతంగా ప్రయోగించారు.

ఇన్‌శాట్ – %×చీూఋ% లేదా భారత జాతీయ ఉపగ్రహ వ్యవస్థ అనేది సమాచారం, వాతావరణం, ప్రసారాలు మొదలయిన బహుళ ప్రయోజనాల కోసం ఇస్రో తయారు చేసిన ఉపగ్రహాల శ్రేణి. 1983లో మొదలయిన ఇన్‌శాట్, ఆసియా, పసిఫిక్ దేశాల్లో అతిపెద్ద ఉపగ్రహాల వ్యవస్థ. ప్రస్తుతం 199 ట్రాన్స్ పాండర్లతో భారతదేశం లోని దాదాపు అన్ని టెలివిజన్, రేడియోలకు మాధ్యమంగా ఉన్న ఈ ఉపగ్రహాలను కర్నాటకలోని హస్సన్, భోపాల్ ల నుండి అనుక్షణం పర్యవేక్షిస్తుంటారు. తద్వారా అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం ఎంతో ముందంజలో ఉందని కొనియాడారు. అంతరిక్ష ప్రయోగాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతారని ప్రశ్నించే వారికి... దీపావళి పండుగ కోసం పటాసులు కాల్చడానికి దాదాపు 600 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారనేది ఒక అంచనా ఉందని, అయితే మంగళయాన్ ప్రయోగం కోసం ఇస్రో కేవలం వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి విజయం సాధించడం గొప్ప పరిణామమని ఆయన ధీటైన సమాధానం చెప్పారు. ప్రపంచ దేశాలు చేయలేని సాహసం ఇస్రో చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళయాన్ సక్సెస్‌తో భారత్ ప్రపంచ దేశాల సరసన చేరిందని వెల్లడించారు. అంతరిక్ష రంగంలో అధునాతన సామర్థ్యాలు కలిగి ఉన్న కొన్ని దేశాలలో భారత్ ఒకటి. భారత్ లో ప్రతిష్ఠాత్మక ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి... 1.తుంబా: కేరళలో తిరువనంత పురం సమీపాన భూ అయస్కాంత రేఖకు దగ్గరలో ఉన్న తుంబాలో 1962లో మొదటి రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి శాస్త్రవేత్తలలో అబ్దుల్ కలాం ఒకరు. మొదట కేవలం రాకెట్ల ప్రయోగ కేంద్రముగా ఉన్న తుంబా నెమ్మదిగా రాకెట్లకు అవసర మయిన ప్రొపెల్లర్లు, ఇంజన్లు తయారు చేసి అమర్చ గలిగి పూర్తిస్థాయి రాకెట్ నిర్మాణ కేంద్రంగా తయారయింది. 2.శ్రీహరి కోట: భారత దేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువయిన ప్రదేశ మయిన శ్రీహరికోట నెల్లూరు జిల్లాలో సూళ్ళూరుపేట దగ్గర ఉంది. ఈ అంతరిక్ష కేంద్రం పేరు “సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం”. దీనినే “షార్” అని కూడా పిలుస్తారు. ఇది భారతదేశం లోని ఉపగ్రహ ప్రయోగ కేంద్రం. ఇక్కడనుండి ఎన్నో పి.ఎస్ ఎల్. విబీ జి.ఎస్.ఎల్.వి ఉప గ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. ప్రస్తుతం ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్‌లు ఉన్నాయి. ఈ రెండిటి వల్ల ప్రతి ఏడాది 6 శాటిలైట్లను ప్రయోగించే వీలు ఉంది. 3.బలేశ్వర్ ఒరిస్సాలో ఉంది. శ్రీహరికోటలో ఉన్నట్లు ఇక్కడ శాటిలైట్ల ప్రయోగానికి సౌకర్యాలు లేకున్నా, దీనిని ప్రధానంగా క్షిపణులను ప్రయోగించుటకు ఉపయోగిస్తారు. 2005లో రెండవ లాంచి ప్యాడు ఆపరేషను, 2008 లో చంద్రయాన్, 2014లో మంగళ్ యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం – అప్పటికి ఇది ఇస్రో రికార్డు, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగం – ఇది ప్రపంచ రికార్డు 2017 – జిఎస్ఎల్‌వి మార్క్ 3 ప్రయోగం, దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను విజయ వంతమైంది. ప్రసిద్ధమైన ఇస్రో సంస్థ దేశాభివృద్ధి లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటై, ప్రస్తుతం ప్రపంచంలోని అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరొందింది. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో, దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉంది. ఇస్రో భారత ప్రభుత్వపు అంతరిక్ష శాఖకు అనుబంధంగా ఉంది. అంతరిక్ష శాఖ ప్రధాన మంత్రి, అంతరిక్ష కమిషన్ అధీనంలో ఉంటుంది. ఇస్రో కింది విభాగాలను, సంస్థలను నిర్వహిస్తుంది. అంతరిక్ష కార్యకలాపాల లోకి ప్రయివేటు రంగాల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ అంతరిక్ష రంగంలో చాలా కీలకమైన సంస్కరణలకు ఆమోదం తెలిపింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో మన అంతరిక్ష విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించునే సామర్థ్య మరింతగా పెరుగుతుంది. మన అంతరిక్ష రంగం త్వరిత గతిన అభివృద్ధి చెందటమే కాకుండా.. అంతరిక్ష ఆర్థిక వ్యవహారాల్లో భారత్ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించేందుకు వీలవుతుంది.

# విద్యార్థులకు ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను అందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా







హైదరాబాద్

ప్రజాబలం ప్రతినిధి: జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హైదరాబాద్ లోని షేక్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను విద్యార్థులకు అందించారు . జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాల లతో పాటు అంగన్‌వాడీలలో సుమారు 98 లక్షల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు .పిల్లల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదని మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడించారు .

పిల్లలే జాతి సంపద అన్నారు , ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలందరూ ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను వేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు

# ఇండియా కూటమి ఎంపీల అరెస్టుపై ఎంపీ మల్లు రవి ఆగ్రహం..



న్యూఢిల్లీ, 11, ఆగస్టు 2025 ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఈసీని కలవడానికి ప్రయత్నించిన ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఖండించారు. మోదీ, బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు ఇది పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు తమను అడ్డుకున్నా.. 140 కోట్ల మందికి దేశంలో ఏం జరుగుతుందో తెలిసిందన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

‘త్వరలో బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సమయంలో ఓట్ల చోరీ ఇష్యూ చర్చనీయాంశంగా మారింది. దీని గురించి కాంగ్రెస్ సహా.. ఇండియా కూటమి ఎంపీలు ఎలక్షన్ కమిషన్‌ను కలవాలని ప్రయత్నించారు. పార్లమెంట్ నుంచి కొంచెం దూరం రాగానే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే కూర్చొని ఆందోళన చేపట్టాం. ఈ సమయంలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు’ అని ఎంపీ మల్లు రవి వివరించారు.

‘మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ లోక్ సభ స్టార్ట్ అయ్యింది. మమ్మల్ని సభలోకి అనుమతించలేదు. గట్టిగా ప్రశ్నించడంతో.. సభలోకి అనుమతించారు. ఓట్ల చోరీ గురించి ప్రశ్నిస్తే.. సభ వాయిదా వేస్తున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంపై చర్చకు పట్టుబట్టాం. కానీ మోదీ ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా లేదు. కీలకమైన అంశాలపైనా చర్చలు జరపడం లేదు. కనీసం జీరో అవర్‌లో ప్రశ్నలు అడిగే అవకాశం కూడా ఇవ్వడం లేదు. ఎలాంటి చర్చ లేకుండానే కీలక బిల్లులను ఆమోదిస్తున్నారు.’ ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

‘పార్లమెంట్ జరగకుండా మోదీ ప్లాన్ చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం చేసే పనులను 140 కోట్ల మంది గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించక తప్పదు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే.. దేశంలో ప్రజాస్వామ్యం బతుకుతుంది. మోదీ, బీజేపీ, ఢిల్లీ పోలీసులు మమ్మల్ని ఎలక్షన్ కమిషన్ దగ్గరకు వెళ్లకుండా ఆపగలిగారు. కానీ.. మా పోరాటం 140 కోట్ల మంది ప్రజలకు తెలిసింది. రాహుల్ గాంధీ పోరాటంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది’ అని ఎంపీ డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు.





రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ ు స్థానిక ఖని చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేసిన ఘటనపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష స్వరాలను అణగదొక్కే విధానాన్ని అవలంబిస్తోందని ఆరోపించారు. దేశ ప్రజల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని, నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.

# శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా భీమేశ్వరాలయంలో వైభవంగా మహాలింగార్చన.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర ఆలయ సన్నిధిలో శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా మహా లింగార్చన పూజా కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా 365 జ్యోతులను లింగాకారంలో వెలిగించి, విశేష పూజలు గావించారు. స్వామివారిని శోభాయమానంగా ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు చేసినట్లు అర్చక స్వాములు, వేద పండితులు వెల్లడించారు.

రాజన్న ఆలయ ఈవో రాధాబాయి, మహా లింగార్చన కార్యక్రమంలో పాల్గొని జ్యోతులు వెలిగించారు.

ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏ ఈ ఓ జి.అశోక్ కుమార్, అనుబంధ ఆలయ పర్యవేక్షకులు ఊడెపు వెంకటప్రసాద్, ఆలయ ఇన్స్పెక్టర్ టి. రాజేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్ కు భారీగా వరద

హైదరాబాద్ హుస్సేన్ సాగర్ కు భారీగా వరద చేరింది. దాంతో సాగర్ నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్ కు వరద పోటెత్తింది. బంజారా , బల్కాపూర్, పికెట్ , కూకట్ పల్లి నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వరద వస్తుంది. హుస్సేన్ సాగర్ కు ఇన్ ఫ్లో 1027 క్యూసెక్కుల వరద. హుస్సెన్ సాగర్ ప్రస్తుత 513.50 మీటర్లు గా నీటి మట్టం వుంది. హుస్సెన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు . తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని మూసి లోకి వదులుతున్నారు. హుస్సేన్ సాగర్ ఔట్ ఫ్లో 1130 క్యూసెక్కుల నీటిని మూసి లోకి విడుదల చేసారు. ఈ నేపథ్యంలో మూసి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసారు.

# నగరంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలి:జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్





హైదరాబాద్, ఆగస్ట్ 11, 2025:రానున్న గణేష్ ఉత్సవాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా , శాంతియుత వాతావరణంలో జరిగేలా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సహకారం అందించాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు.

సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 27 వ తేదీన ప్రారంభమై సెప్టెంబర్ 6 వ తేదీన పూర్తి కానున్న గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కమిషనర్ అధ్యక్షతన సన్నాహక సమన్వయ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ...

గత సంవత్సరం మాదిరి గానే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఘనంగా గణేష్ ఉత్సవాలు జరిగేలా జీహెచ్ఎంసీ, పోలీస్, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తుందని తెలిపారు.

ఇప్పటికే నగర పరిధిలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గణేష్ ప్రతిమల ఊరేగింపు జరిగే జాతీయ రహదారుల్లో ఏమైనా రోడ్లు రిపేర్ ఉంటే వాటిని కూడా చేపడతామని చెప్పారు. పోలీస్ శాఖ సూచన మేరకు నిమజ్జనం సజావుగా, వేగంగా పూర్తి చేసేందుకు గత సంవత్సరం కంటే ఎక్కువ క్రేన్ లు కూడా ఉపయోగిస్తామని చెప్పారు.

గణేష్ ఉత్సవాల కు బడ్జెట్ ప్రాబ్లం లేదని, వివిధ పనుల నిమిత్తం గతం కంటే కూడా అధిక నిధులు కేటాయిస్తామని, లాజిస్టిక్స్ సమకూర్చుతామనీ కమిషనర్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులకు తెలిపారు. వేడుక సజావుగా జరిగేందుకు జోనల్ పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. గత లోటుపాట్లను సమీక్షించుకుంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గణేష్ ఉత్సవాలను జరిగేలా చూస్తామని కమిషనర్ తెలిపారు.

లా అండ్ ఆర్డర్ అదనపు సిపి విక్రమ్ సింగ్ మాన్ గణేష్ ఉత్సవాలు సజావుగా జరిగేందుకు పలు సూచనలు చేశారు.ప్రతి సంవత్సరం భాగ్యనగర్, ఇతర గణేష్ ఉత్సవ సమితి లు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పండుగ సజావుగా జరుపుకుంటున్నామని అని తెలిపారు.

వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున గణేష్ పండా లు, మండపాల నిర్మాణానికి క్వాలిటీ మెటీరియల్ , క్వాలిటీ వైరింగ్ తో సహా నాణ్యమైన లాజిస్టిక్ ఉపయోగించాలని చెప్పారు.

ఊరేగింపు సమయంలో ప్రతిమల అధిక ఎత్తుతో ఇబ్బందులు, ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ముందే రూట్ మ్యాప్ , వాహనం హైట్ ఆధారంగా ప్రతిమలను ప్రతిష్టించాలని కోరారు. ప్రతి మండపం వద్ద కనీసం ఒక్క సీసీ కెమెరా ఏర్పాటు చేసుకునేలా చూడాలని కోరారు. పెద్ద మండపాల్లో ముగ్గురికి తగ్గకుండా వాలంటీర్ సేవలను ఉపయోగించుకోవాలని చెప్పారు. పెద్ద మండపాలలో సందర్శనం కోసం వచ్చే మార్గాలను వేరు వేరు గా ఏర్పాటు చేయాలన్నారు.

ఖైరతాబాద్, బాలాపూర్ సహా నగరంలోని అన్ని గణేష్ విగ్రహాల ఊరేగింపు సకాలంలో ప్రారంభం అయ్యేలా సహకరిస్తే నిమజ్జనం సజావుగా సాగుతుందని చెప్పారు.

అంతకుముందు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు గణేష్ ఉత్సవాలు సజావుగా జరిగేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.

సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్,

అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్,CE రత్నాకర్, జోనల్ కమిషనర్ లు,

HMDA, HMRL, TSRTC, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పోలీస్ అధికారులు, HMS&SB, అగ్నిమాపక, నీటిపారుదల, పర్యాటకం, ఆరోగ్యం, కాలుష్య నియంత్రణ బోర్డు, ట్రాన్స్కో అధికారులు పాల్గొన్నారు .

## జమ్మికుంట ఎక్సైజ్ సిఐ పై చర్యలకు కలెక్టర్ కు ఫిర్యాదు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 11** జమ్మికుంట ఎక్సైజ్ సీఐ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు పిడిఎస్యు జిల్లా కమిటీ అధ్యక్షులు అంగిడి కుమార్ వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సిపిఐ( ఎంఎల్) మాస్ లైన్ ( ప్రజా పంథా) పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట,ఇల్లంతకుంట, వీణవంక మండలాలలో ఉన్న వైన్ షాప్ లో నుండి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాప్ లు లైసెన్స్ రద్దు చేయాలని బెల్ట్ షాపుల పైన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎక్సైజ్ సిఐ కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం ల్తేదని, బిర్యాని సెంటర్లలో,ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో, హెూటల్లో, కిరాణా షాప్ లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్న గ్రామాలలో ఉన్న బెల్టు షాపులలో ఏరులై పారుతున్న మద్యం పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న వైన్ షాపుల లైసెన్సులు రద్దు చేసి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధించిన ఎక్సైజ్ అధికారాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పైన శాఖ పరమైన చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ధీరజ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 11**పోలీసుల పహారా నడుమ రైతులకు యూరియా పంపిణీ చేసిన సంఘటన సోమవారం వీణవంక మండలం నర్సింగాపూర్ లోని సొసైటీ వద్ద చోటు చేసుకుంది. యూరియా లారీ వచ్చిందని తెలిసిన రైతులు భారీగా అక్కడకు చేరుకున్నారు. అంతకుముందు జమ్మికుంట కరీంనగర్ ప్రధాన రహదారి పై ధర్నా నిర్వహించారు.

వారు మాట్లాడుతూ సాగుకు సరిపడా యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజావాణికి 114 దరఖాస్తులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు- 11 (ప్రజాబలం ప్రతినిధి)**ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయి.

రెవెన్యూ శాఖకు 36, గృహ నిర్మాణ శాఖకు 26, డీఆర్డీఏ 20, ఉపాధి కల్పన శాఖకు 7, పంచాయితీ, సంక్షేమ శాఖలకు 5 చొప్పున, పౌర సరఫరాల శాఖకు 4, సెస్ కు 3, ఎస్డీసీ, మున్సిపల్ కమీషనర్ సిరిసిల్ల కు 2 చొప్పున, వ్యవసాయ, వైద్యారోగ్య, విద్యా శాఖ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం



**ఆరాధన సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 11 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఆగస్టు11,2025 సోమవారం ఈరోజు తంగళ్ళపల్లి మండలంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నులిపురుగుల మాత్రల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ 1 సంవత్సరం నుంచి19 వయసుగల పిల్లలందరి ఆరోగ్యాన్ని కాపాడడానికి పాఠశాల ఉపాధ్యాయుల, ఆరోగ్య సిబ్బందికి, ఆల్బెండజోల్ మాత్రను నమిలి మింగేలా చూసుకోవాల్సిందిగా ఆదేశించినారు. నులిపురుగులు బహిరంగ మలవిసర్జన, పిల్లలు మట్టిలో పాదరక్షలు లేకుండా ఆడుకున్నప్పుడు లేదా చేతులు కడుక్కోవడం మరిచిపోయినప్పుడు పేగు పురుగులు గుడ్లు శరీరంలో పెరిగి అనారోగ్యం కలిగిస్తాయని ఈ నులిపురుగులు కడుపులో ఉండటం వల్ల కడుపు నొప్పి వికారము వాంతులు విరోచనాలు, ఆకలి లేకపోవడం, బలహీనత, రక్తహీనత, తగ్గడం, పోషకాహార లోపం, శరీరక మానసిక అభివృద్ధి మందగించడం లాంటి లక్షణాలు రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రను నమిలి మింగాలని , 1 సంవత్సరం నుంచి19 సంవత్సరాల వయసు గల అందరు పిల్లలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల పాఠశాలలో, అంగనవాడి కేంద్రాలలో నులిపురుగుల మాత్రలు( ఆల్బెండజోల్ మాత్రలు) ఉచితంగా ఆగస్టు 11వ తేదీ ఈరోజు పాఠశాల పిల్లలు పరిశుభ్రమైన చేతులతో ఆల్బెండజోల్ మాత్ర పరిశుభ్రమైన నీటితో మింగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా చిన్న పిల్లల తల్లిదండ్రులకు ఇంకా మిగిలిపోయిన పిల్లలకు 18 తేదీ మ్యాప్ డే రోజు ఆల్బెండజోల్ మాత్రను మింగించవలసిన ఆవశ్యకతను పిల్లల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆరోగ్య సిబ్బందికి ఈ సందర్భంగా సూచనలు సలహాలు చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ప్రోగ్రాం ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ ఏనుగుల దినోత్సవం

ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 12వ తేదీన నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగులను కాపాడి సంరక్షించాలన్న ఉద్దేశంతో 2012లో ఈ దినోత్సవం ఏర్పాటు చేశారు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా కలిసిపోయే ఏనుగులకు కూడా భావోద్వేగాలుండటమే కాకుండా తెలివి, జ్ఞాపకశక్తి ఎక్కువపాళ్ళలో ఉంటాయి. దంతాల కోసం, ఇతర శరీర భాగాల కోసం ఏనుగులను చంపేయడంతో, వాటి సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతుంది. ఏనుగులకోసం ఒక దినోత్సవం ఉంటే వాటి రక్షణపై అవగాహన పెరిగుతుందన్న ఉద్దేశ్యంతో కెనడాలోని కెనజ్వెస్ట్ పిక్చర్స్ చిత్ర నిర్మాతలు ఏనుగుల సంరక్షణ ప్రచారకులు ప్యాట్రిసియా సిమ్స్, మైఖేల్ క్లార్క్ 2011లో దీనిని రూపొందించారు. థాయిలాండ్లోని ఎలిఫెంట్ రీఇంట్రడక్షన్ ఫౌండేషన్ సెక్రటరీ జనరల్ శివపోర్న్ దర్దరానంద మద్దతుతో ప్యాట్రిసియా సిమ్స్, ఎలిఫెంట్ రీఇంట్రోడక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2012, ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రారంభించబడింది. అప్పటినుండి ప్యాట్రిసియా సిమ్స్ ఈ దినోత్సవానికి నాయకత్వం వహిస్తుండగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలలోని 65కి పైగా వన్యప్రాణుల సంస్థలు, చాలామంది వ్యక్తులు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.

## కత్తులతో వీధుల్లో దొంగలహల్ చల్

ఖమ్మంలో దొంగలు హల్ చల్ చేస్తున్నారు.గొల్లగూడెంలో చోరీలు చేసేందుకు దొంగలు వీధుల్లో తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. చేతిలో మారణాయుధాలతో మాస్కులు ధరించి భయానకంగా ఉన్నారు. తాళం వేసిన ఓ ఇంట్లోకి ప్రవేశించి కలియతిరిగిన దృశ్యాలు వైరలవ్వగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లిలోని సింగరేణి కాలరీప్ లో కుడా దొంగలు చోరీకి ప్రయత్నించారు.

# అడవి తల్లిబాటకు శ్రీకారం

విశాఖపట్టణం, ఆగస్టు 11, ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న సౌకర్యం చివరికి వారి గడపకు రానున్న సమయం ఆసన్నమైంది. కొండలు, అడవులు, లోయల మధ్య ఉంటూ రోడ్డు అనే మాట విని కూడా చూడని గిరిజన ఆవాసాల జీవితం ఇక పూర్తిగా మారబోతోంది. ఒక నిర్ణయం, ఒక ప్రణాళిక ఇప్పుడు వారిని అభివృద్ధి దిశగా నడిపించబోతుంది. ఈ ప్రణాళిక పూర్తయ్యే సరికి, ఆ ప్రాంతాల ప్రజలకు ఇది నిజమైన పండుగవలె మారనుంది. ఇంతకు ఆ నిర్ణయం తీసుకున్నది ఎవరో కాదు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్. 'అడవి తల్లి బాట' రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం మధ్యాహ్నం గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో 'అడవి తల్లి బాట' పేరుతో చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం అందనుంది. రూ.1005 కోట్లతో భారీ ప్రాజెక్ట్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పీఎం జన్ మన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి మొత్తం రూ. 1005 కోట్లతో చేపట్టబడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేని ఆవాసాలను కూడా అనుసంధానించేలా రెండు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. సవాళ్లు, అవరోధాలు.. కానీ అడుగులు ఆగవు అధికారులు సమావేశంలో పనుల ప్రస్తుత స్థితి వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను కలిపే రోడ్లు వేసేందుకు బండరాళ్లను బద్ధలుకొడుతూ ముందుకు సాగడం వల్ల ఎక్కువ సమయం పట్టుతోందని, అలాగే నిటారుగా ఉన్న ప్రాంతాలు కావడంతో సాంకేతిక జాగ్రత్తలు తప్పనిసరని చెప్పారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో పనుల వేగం కొంత తగ్గిందని, అయితే ప్రయత్నాలు ఆగలేదని తెలిపారు. అటవీ అనుమతుల సమస్య ? పరిష్కారం దిశగా మొత్తం 128 రహదారి మార్గాలు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండటంతో అటవీ అనుమతులు అవసరమయ్యాయి. వీటిలో 98 మార్గాలకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 186 పనులు ప్రారంభమయ్యాయని, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెక్నికల్ ఎవాల్యుయేషన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డోలీరహిత గిరిజన ఆవాసాల లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం జన్ మన్ పథకం ద్వారా రూ.555.6 కోట్లు కేటాయించి సహకరించారని పవన్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూడా వినియోగిస్తున్నాం. ఇన్ని వనరులు ఉన్నందున 'అడవి తల్లి బాట' పనుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిరంతర పర్యవేక్షణతోనే పనులు వేగంగా పూర్తవుతాయి. సవాళ్లు ఎదురైనా ప్రణాళికాబద్ధంగా అధిగమించాలి. అవసరమైతే అటవీ శాఖతో సమీక్ష జరిపి అనుమతులను త్వరగా పొందాలని పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం అవసరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ పనుల ప్రాధాన్యతను స్థానికులకు తెలియజేయాలని, తద్వారా వారు కూడా సహకరించేందుకు ముందుకు వస్తారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రహదారి సౌకర్యం లేని ఆవాసాలు తొలిసారి రోడ్డు పొందుతున్నాయి. ఇది కేవలం రోడ్డు కాదు, అభివృద్ధి దారిలో ఒక మలుపు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పి వారిలో నమ్మకం, ఉత్సాహం కలిగించాలని ఆయన స్పష్టం చేశారు. డోలీరహిత ఆవాసాల లక్ష్యం ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గిరిజన ప్రాంతాల వాణిజ్యం, విద్య, వైద్య సౌకర్యాలు అన్నీ వేగవంతం అవుతాయి. అటు పర్యాటకానికి, ఇటు స్థానికుల ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. రవాణా సౌకర్యం లేని కారణంగా ఇప్పటి వరకు పక్కనున్న పట్టణాలకు చేరుకోవడమే కష్టంగా ఉన్న పరిస్థితి, రోడ్లు అందుబాటులోకి రాగానే పూర్తిగా మారిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ, సాంకేతిక నాణ్యత, ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలని సంకల్పించింది. 'అడవి తల్లి బాట' విజయవంతమైతే, ఇది ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి కాంతి ఇప్పటివరకు తాకని గిరిజన ప్రాంతాల గడప దాటబోతోంది. ఖ

# ఈసీ వర్సెస్ రాహుల్ గాంధీ

దాల్ మే కాలా అని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వ్యవహా ర శైలిని, పనితీరును కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తప్పుబడుతున్నారు. భారతీయ జనతా పార్టీకి లబ్ధి చేకూరే విధంగా గత కొద్ది సంవత్సరాలుగా ఈసీఐ ఎన్నికల నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నదని రాహుల్ ఆరోపణ. గత లోక్‌సభ, మహారాష్ట్ర, హర్యా నా అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాహుల్ తరచుగా ఈసీఐని వేలెత్తి చూపుతున్నారు.

కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేస్తూ కర్నాటకలో ఓట్ల చోరీపై చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే రాహుల్ గాంధీ ఆరోపణలపై మండిపడుతున్న ఎన్నికల సంఘం.. ఆయన్ను తన ఆరోపణలపై ప్రమాణం చేసి వివరాలు ఇవ్వాలని, లేదంటే దేశానికి క్షమాపణలు చెప్పాలంటూ ఉరుముతోంది. అయితే రాహుల్ స్పందించకపోవడంతో తానే స్వయంగా ఫ్యాక్ట్ చేసి వివరాలను విడుదల చేస్తోంది. ఇదే క్రమంలో రాహుల్ గాంధీ తాజాగా చేసిన ఓట్ల చోరీ ఆరోపణల్లో ఒకటైన బెంగళూరు వృద్ధురాలి ఓట్ల నమోదుపై ఇవాళ ఈసీ ఫ్యాక్ట్ చెక్ విడుదల చేసింది. శకునా రాణి అనే 70 ఏళ్ల మహిళ తొలిసారి ఓటు నమోదు చేసుకుందని, ఫామ్ 6ను దుర్వినియోగం చేసి ఒకే నెలలో రెండు ఓట్లు నమోదు చేయించుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. రాహుల్ ఆరోపణల్ని తోసిపుచ్చింది. తమ విచారణలో శకున్ రాణి రాహుల్ గాంధీ చెప్పినట్లు రెండుసార్లు కాదు, ఒక్కసారి మాత్రమే ఓటు వేసిందని తేలినట్లు ఈసీ పేర్కొంది. బెంగళూరులో ప్రజెంటేషన్ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. శకున్ రాణి ఓటరు గుర్తింపు కార్డును వాడి రెండు ఓట్లు వేశారని, పోలింగ్ బూత్ అధికారి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టిక్ మార్కులు ఉన్న పత్రాన్ని చూపించారని ఆరోపించారు. అయితే, ఎన్నికల కమిషన్ తన 5 పాయింట్ల సమాధానంలో రాహుల్ చూపించిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసింది కాదని తేల్చేసిందిఆయన ఆరోపణలతో ఎన్నికల నిర్వహణ తీరుపై దేశ ప్రజల కున్న విశ్వాసం ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం మహదేవపుర సెగ్మెంట్ ఎన్నికల జాబితాలో వున్న అవకతవకలను రాహుల్ రెండ్రోజుల క్రితం విలేకరులకు వివరించారు. 2024 ఎన్నికల్లో మిగతా సెగ్మెంట్ల కంటే మహదేవపురలో బీజేపీకి అనూహ్యం గా ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.ఒక గది ఉన్న ఇంటిలో పదుల సంఖ్యలో ఓటర్ల నమోదు, ఒకే ఓటరు పేరు పలుమార్లు నమోదు కావడం, ఓటర్ల ఫొటో లేకుండా, చిరునామా లేకుండా ఓటరు జాబితా తయారు చేయ డం డీకే ఓటరు పేరు పలు బూత్‌లలో దర్శనమీయడం వంటి అవకతవకల్ని రాహుల్ ఓటరు జాబితాను ముందుంచి ఎత్తిచూపారు. పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్ రాణి రెండుసార్లు ఓటు వేసినట్లు మీరు చెప్పారని ఈసీ గుర్తుచేసింది.

అయితే తమ అధికారులు నిర్వహించిన ప్రాథమిక విచారణలో మీరు ప్రజెంటేషన్‌లో చూపించిన టిక్ మార్క్ చేసిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసిన పత్రం కాదని తేలినట్లు ఈసీ ఫ్యాక్ట్ చెక్ లో పేర్కొంది. దీనిపై రాహుల్ గాంధీకి సంబంధిత పత్రాలు ఇవ్వాలని నోటీసు పంపినట్లు ఈసీ తెలిపింది. వీటి ఆధారంగా శకున్ రాణి లేదా మరెవరైనా రెండుసార్లు ఓటు వేశారో లేదో సమగ్ర విచారణ చేపట్టవచ్చని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ తన పార్టీ డిజిటల్ ఓటరు జాబితా, ఓటింగ్ బూత్ సీసీటీవీ ఫుటేజ్ ను ఈసీ నుంచి కోరామని, కానీ వారు ఆ సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో తాము స్వంత దర్యాప్తు చేసామని, సమాచార హక్కు పిటిషన్లు దాఖలు చేసిన వివరాలు తీసుకున్నట్లు తెలిపారు. అందులో లభించిన ఆధారాలతో ఈసీ, బీజేపీ ఓట్లు దొంగిలించాయని ఆరోపించారు. మిగతా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిలో ఎన్నికల కమిషన్ బీజేపీకి ప్రయోజనం చేకూర్చిందని, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే విధంగా ఈసీఐ వ్యవహరించి తక్కువ మెజారిటీతోనైనా, బీజేపీ గట్టెక్కేలా చేసిందని రాహుల్ ఆరోపణ. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో తప్పులు వెరసి, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చతెచ్చేలా ఈసీఐ వ్యవహరించిందనే తీవ్ర ఆరోపణను ఆయన ముందుకు తెచ్చారు.

బీహార్‌లో ఈసీఐ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఇప్పటికే వివాదాస్పదమైన నేపథ్యంలో రాహుల్ చేసిన విమర్శలు చర్చనీ యాంశంగా మారాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటింగ్ సమయం గడువుకు కొద్దిముందుగా ఓటర్లు బారులుతీరడం, అసలు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించడం బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకేనని రాహుల్ వాదన. దీనిపై తీవ్రంగా స్పందించిన ఈసీఐ, ఆధారాలలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. రాహుల్ చేసిన ఆరోపణల్లో పసలేదని ఈసీఐ బలంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నది. ఈసీఐ అడిగినట్టుగా అఫిడవిట్ దాఖలు చేసినా, దానిపై సంతకం చేసేందుకు రాహుల్ భయపడుతు న్నారని ఇప్పుడు ఈసీఐ పరోక్షంగా ఆ ఆరోపణలు తప్పుల తడక అని చెప్పే ప్రయత్నమూ చేస్తున్నది. రాజ్యాంగ సంస్థలపై దాడి చేయడం రాహుల్‌కు మామూలేనని, ఇదీ దానిలో భాగమేనని బీజేపీ మంత్రులు, నాయకులు వెనువెంటనే స్పందించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్టుగా, బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినట్టుగా రాహుల్ మాట్లాడుతుంటారని బీజేపీ నాయకులు కొట్టిపారేస్తున్నారు.

# మారనున్న విశాఖ రూపు రేఖలు

విశాఖపట్టణం, ఆగస్టు 11,ఉమ్మడి ఏపీలోహైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలు వచ్చిన తర్వాత ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్ ముఖచిత్రం కూడా మారనుంది. ఏపీకి దిగ్గజ ఐటీ సంస్థ గూగుల్ రానుంది. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఇది ఏపీకి గేమ్ చేంజర్ కానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు గూగుల్ 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనుంది. దీంతో లక్షలాది ఉద్యోగాలు రానున్నాయి.గూగుల్ సంస్థ విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ ను నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు ఆసియాలోనే అతి పెద్దదిగా తెలుస్తోంది. భారతదేశంలో మొదటి ప్రత్యక్ష డేటా సెంటర్ కూడా కానుంది. ఇప్పటికే గూగుల్ సింగపూర్, మలేషియా, థాయిలాండ్లలో సైతం విస్తరించింది. ఈ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు సంబంధించి మధురవాడలో 500 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించనుంది. ప్రాథమికంగా 80 ఎకరాల్లో ఈ డేటా సెంటర్ పనులు ప్రారంభం కానున్నాయి. అయితే విశాఖకు ఈ దిగ్గజ ఐటీ సంస్థ రావడం మాత్రం నవ్యాంధ్రప్రదేశ్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అంశాలకు దాహదం.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో.. భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకుఎంతగానో దోహదపడనుంది. ప్రధానంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, యూట్యూబ్, సెర్చ్ ఇంజిన్ వంటి గూగుల్ సేవలను ఇది మరింత ఊతం ఇవ్వనుంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. సాంకేతిక శిక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాలలో మరిన్ని పెట్టుబడులు వస్తాయి. రెండు బిలియన్ డాలర్ల పునరుత్పాదక శక్తి పెట్టుబడి.. పర్యావరణ స్థిరత్వాన్ని కూడా ప్రోత్సహించనుంది. ఇది భారతదేశ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. విశాఖపట్నం ఆసియా ఖండంలోనే డిజిటల్ హబ్ గా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

# చంద్రబాబు బొమ్మే.. ఐడెంటెటీనా...



విజయవాడ, ఆగస్టు 11, నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 95 సీఎం అంటూ దూసుకుపోతున్నారు. గత మూడు పర్యాయాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, వినూత్న రాజకీయాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, పెట్టుబడులను ఆకర్షించి కొత్త ఉద్యోగాలు సృష్టించడం అన్న లక్ష్యాలతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. గడిచిన 14 నెలలుగా పాలనలో సంస్కరణలు తీసుకువచ్చిన చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టానని అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలకు డబ్బు కేటాయించి వైసీపీ విమర్శలు తిప్పికొడుతున్నారు. తన పనితీరుతో అందరితో శభాష్ అనిపించుకోవాలని తాపత్రయపడుతున్న సీఎం.. సొంత కేడర్ నుంచి ఎదురవుతున్న విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఏడాది క్రితం 4.వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబుపై విపక్షం కన్నా ఎక్కువగా స్వపక్షమే విమర్శలు గుప్పిస్తోంది. 95 సీఎం అంటూ వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు.. కార్యకర్తలను సంతృప్తి పరిచే నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీనికి టీడీపీ సోషల్ మీడియా వేదికలనే ఉదాహరణగా చెబుతున్నారు. రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాన్చుడు ధోరణిపై సోషల్ మీడియా సైనికులు అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి మండిపడుతున్నారు. అయితే సోషల్ సైనికులు ఒత్తిడికి తలొగ్గి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేమని పార్టీ పెద్దలు తొలుత చెప్పుకొచ్చారు. సొంత వారి విమర్శల నుంచి చంద్రబాబును రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఏడాది అయినా ఈ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సోషల్ మీడియా శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు అధికార చట్రంలో బంధీ మరోవైపు తాను పూర్తిగా మారిపోయినట్లు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు.. మళ్లీ అధికారుల చట్రబంధంలోకి క్రమంగా ఇరుక్కుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీ కార్యకర్తలకు చంద్రబాబుకు మధ్య యథావిధిగా గ్యాప్ వచ్చేస్తోందని అంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కార్యకర్తలకన్నా అధికార యంత్రాంగానికి ఎక్కువ విలువనివ్వడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని వ్యాఖ్యలు ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయని చెబుతున్నారు. గత 14 నెలలో సీఎం ఎక్కువగా అధికార కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారని, కార్యకర్తల సాధకబాధలు తెలుసుకోడానికి అసలు సమయం కేటాయించడం లేదని విమర్శలు ఎక్కువవుతున్నాయి. తాను పూర్తిస్థాయిలో పనిచేస్తున్నా, మంత్రులు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయడం లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలపైనా నిరసన వ్యక్తమవుతోందని అంటున్నారు. చంద్రబాబు సీఎంగా వ్యవహరిస్తున్నారే కానీ, పార్టీ అధినేతగా తమ సమస్యలు తెలుసుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రులు అంతర్గత సంభాషణల్లో వాపోతున్నారని చెబుతున్నారు. వచ్చేఎన్నికల నాటికి పేదరికం అంతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న చంద్రబాబు నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా టార్గెట్లు పెట్టడంపైనా ఎమ్మెల్యేలు, మంత్రులు లబోదిబోమంటున్నారని అంటున్నారు. అందుబాటులో లేని అధినేత ఈ సారి పాలనలో తనలో పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని చూస్తారని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయంపైనా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో ఓ సారి మంత్రి, ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు నిర్వహిస్తానని చెప్పిన చంద్రబాబు.. ఒకరోజు మాత్రమే ఆ పనిచేశారని అంటున్నారు. నిత్యం బిజీ షెడ్యూలుతో సీఎం ఉండటం వల్ల పార్టీ పరమైన సమస్యలు, రాజకీయ నిర్ణయాల విషయంలో ఆయనను సంప్రదించడం కుదరడం లేదని అంటున్నారు. పార్టీ పరంగా మంత్రి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా అందుబాటులో ఉంటున్నా, చంద్రబాబు దృష్టికి తేకుండా ఏ నిర్ణయం తీసుకోలేని వాతావరణం ఉండటం కూడా నియోజకవర్గాల్లో ఇబ్బందులు సృష్టిస్తోందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. దీంతో చంద్రబాబు ఎప్పటిలా వన్ వేలో ప్రయాణిస్తూ తమను వెనక్కి వదిలేస్తున్నారని టీడీపీ ప్రజాప్రతినిధులు లబోదిబోమంటున్నారు.

# రాష్ట్రాల్లో సృష్టి రహస్యాలు

హైదరాబాద్, ఆగస్టు 11, సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసు తీవ్రత జాతీయ స్థాయికి చేరింది. డాక్టర్ నమ్రతకు చెందిన సృష్టి హాస్పిటల్ పెద్ద ఎత్తున నగదు లావాదేవిలు జరపడంతో మనీల్యాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. దాంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి హాస్పిటల్ కేసులోఈడీ రంగ ప్రవేశం చేసింది. తమకు కేసు వివరాలను తెలియజేయాలని ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీసులకు లేఖ రాశారు.డాక్టర్ నమ్రత సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో 8 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించినట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 80 మంది పిల్లలను విక్రయించి రూ.25 కోట్ల వరకు వసూలు చేసినట్లు భావిస్తున్నారు. ఆ డబ్బును డాక్టర్ నమ్రత విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్రతా బ్యాంక్ ఖాతాలతోపాటు, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్యాంక్ లావాదేవీలను పరిశీలించిన అధికారులు మనీ లాండరింగ్ జరిగిందని గుర్తించారు. సృష్టి ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రత ఎనిమిది రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చైల్డ్ ట్రాఫికింగ్ ద్వారా కోట్ల రూపాయలు సంపాదించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలతో ఈడీ రంగంలోకి దిగింది.సంతానం కలగడం లేదని ఆస్పత్రికి వస్తున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ఐవీఎఫ్ విధానంలో పిల్లలు పుడతారని నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయాల్లో వసూలు చేసినట్లు డాక్టర్ నమ్రతపై ఆరోపణలున్నాయి. బిక్షాటన చేసేవారు, మద్యం తాగడానికి డబ్బుల కోసం చూసే వారిని తీసుకెళ్లి వారికి వెయ్యి రూపాయల చొప్పున ఇచ్చి వారి వద్ద నుంచి స్పెర్మ్ కలెక్ట్ చేసి ఐవీఎఫ్ చేశారని సైతం ఆరోపణలు వచ్చాయి. ఆపై నవజాత శిశువులను కొనుగోలు చేసి వారినే ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలు అని డాక్టర్ నమ్రత, హాస్పిటల్ సిబ్బంది ఎందరో దంపతుల నుంచి లక్షల రూపాయల చొప్పున వసూళ్లకు పాల్పడ్డారు.ఇటీవల విజయవాడ పోలీసులు ఒక నవజాత శిశువును అమ్ముతున్న గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ గ్యాంగ్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ పిల్లలను అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. విజయవాడలో ఇలాంటి మూడు నుంచి నాలుగు గ్యాంగ్లు క్రియాశీలంగా ఉన్నాయని సమాచారం. ఈ గ్యాంగ్లకు సృష్టి హాస్పిటల్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ సభ్యులు సృష్టి హాస్పిటల్ హైదరాబాద్ ఆఫీస్, విజయవాడ బ్రాంచ్‌ను సైతం సందర్శించినట్లు పోలీసులకు ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ కేసులో పోలీసులు ఇదివరకే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. డాక్టర్ నమ్రత కేసు విచారణలో పోలీసులకు సహకరించడం లేదు. పైగా త్వరలోనే బయటకు వచ్చాక తనను ఇబ్బంది పెట్టిన వారి సంగతి చూస్తానని చెప్పడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏపీలో జరిగిన దానికి హైదరాబాద్ లో కేసు నమోదు విచారణ చేపట్టారని ఆమె తరఫు లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు.

# వ్యాన్ బోల్తావ్యక్తి, గోవులు మృతి





విశాఖపట్నం సోమవారం ల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో నరసన్నపేట నుంచి విశాఖపట్నం పూర్ణ మార్కెట్ కు ఒక వ్యాన్లో గోవులను రహస్యంగా తరలిస్తుండగా పాత డైరీ ఫారం వద్దకు వచ్చేసరికి ఆ వ్యాన్ ఓ వ్యక్తి ని ఢీ కొట్టి బోల్తా పడింధి ఈ ప్రమాదం లో వ్యాను ఢీ కొట్టిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కొన్ని గోవులు కూడా మృతి చెందాయి..పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేస్తున్నారు

# ట్రంప్ టారిఫ్... అల్లాడుతున్న అమెరికన్స్



న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్) అమెరికా ఫస్ట్ నినాదంతో అధికారంలోకి వచ్చిన ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రపంచ దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు ఇప్పుడు ఆ దేశానికే నష్టం చేస్తున్నాయి. ట్రంప్ విధించిన టారిఫ్‌లు ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో కలకలం రేపుతున్నాయి. ఈ ఏకపక్ష వాణిజ్య విధానాలు విదేశీ దిగుమతులను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, అమెరికన్ వినియోగదారులపైనే ఎక్కువ భారం పడుతోంది. దుస్తుల నుంచి రోజువారీ అవసర వస్తువుల వరకు ధరలు ఆకాశాన్ని అంటడంతో, అమెరికన్లు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు ఈ ధరల పెరుగుదలను స్పష్టంగా చూపిస్తున్నాయి.ట్రంప్ టారిఫ్‌లు, ముఖ్యంగా చైనా, భారత్, కెనడా, మెక్సికో వంటి దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై విధించిన అధిక సుంకాలు, అమెరికాలో వస్తువుల ధరలను గణనీయంగా పెంచాయి. గతంలో 6 డాలర్లకు లభించిన దుస్తులు ఇప్పుడు 10 డాలర్లకు చేరాయి, అంటే దాదాపు 66% ధరల పెరుగుదల. ఇతర రోజువారీ వస్తువుల ధరలు కూడా 1 డాలర్ నుంచి 10 డాలర్ల వరకు పెరిగాయి. ఈ ధరల పెంపు సామాన్య అమెరికన్ కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ సుంకాల వల్ల అమెరికన్ కుటుంబాల వార్షిక ఖర్చు సగటున రూ. 2 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి, జీవన వ్యయం గణనీయంగా పెరుగుతుంది. అమెరికన్లు సూపర్‌మార్కెట్లలో, దుకాణాల్లో ధరల షాక్‌ను రికార్డ్ చేస్తూ, తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.ట్రంప్ టారిఫ్‌ల ఉద్దేశం అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించడం, వాణిజ్య లోటును తగ్గించడం అని పేర్కొన్నారు. అయితే, ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని విశ్లేషకులు అంటున్నారు. చైనా నుంచి 34%, భారత్ నుంచి 26%, యూరోపియన్ యూనియన్ నుంచి 20% వంటి అధిక సుంకాలు విధించడంతో, దిగుమతి వస్తువుల ధరలు పెరిగాయి. ఈ ధరల పెంపు అమెరికన్ వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతోంది. ఈ టారిఫ్‌లకు ప్రతీకారంగా ఇతర దేశాలు కూడా అమెరికా వస్తువులపై సుంకాలు విధిస్తున్నాయి. కెనడా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25% సుంకం విధించింది. చైనా కూడా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధిస్తూ, ప్రపంచ వాణిజ్య సంస్థలో ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తోంది. ఈ వాణిజ్య యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊహించని నష్టాన్ని కలిగిస్తోంది.ఇదిలా ఉంటే.. ట్రంప్ టారిఫ్‌లు కేవలం అమెరికన్లకు మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సుంకాల వల్ల అంతర్జాతీయ వాణిజ్యం క్షీణించి సప్లై చైన్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా, జపాన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను 'అన్యాయమైన' చర్యగా ఖండిస్తూ, ప్రతీకార చర్యలకు దిగాయి. ఇది అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో అలజడిని కలిగించింది. భారత్‌లో సెన్సెక్స్ 76,617 పాయింట్ల నుంచి 75,811 పాయింట్లకు పడిపోయింది, ఇతర ఆసియా మార్కెట్లు కూడా నష్టాలను చవిచూశాయి. టారిఫ్‌ల వల్ల డాలర్ బాండ్ల మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. జపాన్ వంటి దేశాలు వందల బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను విక్రయించడం ప్రారంభించాయి, ఇది అమెరికా ఆర్థిక విశ్వసనీయతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ పరిణామాలు డాలర్ విలువను బలహీనపరిచే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ భారత్‌పై 26% నుంచి 50% వరకు సుంకాలు విధించారు, దీనికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగించడమే కారణమని పేర్కొన్నారు. ఈ సుంకాలు భారత ఎగుమతులను దెబ్బతీసినప్పటికీ, కొన్ని రంగాలైతే లాభపడే అవకాశం ఉంది. చైనాపై అధిక సుంకాల వల్ల భారతీయ టెక్స్‌టైల్, ఫార్మా, ఆటోమొబైల్ విడిభాగాల రంగాలు అమెరికా మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచుకోవచ్చు.

విజయమా, విఫలమా?ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థను రక్షించడంలో విజయవంతం కాకపోవచ్చని నిపుణులు అంటున్నారు. ఈ సుంకాలు స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించే బదులు, వినియోగదారులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. అమెరికన్ ఆర్థిక వేత్తలు ఈ టారిఫ్‌లను 'రెండు వైపులా పదునైన కత్తి'గా అభివర్ణిస్తున్నారు. అంతేకాదు, ఈ విధానాలు అమెరికా యొక్క అంతర్జాతీయ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి, ఇది దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలకు దారితీస్తుంది.

# జనసేన ఆఫీసులో తెలంగాణ మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 11, తెలుగు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్దకు తెలంగాణ మంత్రులు వెళ్లారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి జనసేన కేంద్ర కార్యాలయం వద్దకు వెళ్లారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తరుఫున ఏపీ ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ వీరికి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కొండపల్లి బొమ్మలతో కూడిన జ్ఞాపికలను బహూకరించారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.అయితే పోలవరం బనకచర్ల ప్రాజెక్టు వ్యవహారంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రాజకీయాలు వేడెక్కాయి. సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలను వాడుకుని రాయలసీమను సస్యశ్యామలం చేస్తామంటూ పోలవరం బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. సుమారుగా 80 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. అయితే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్రం నీటి హక్కులకు భంగం కలుగుతుందంటూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టు మీద అభ్యంతరం తెలిపారు. కేంద్ర జలసంఘం వద్ద కూడా దీనిపై తమ అభ్యంతరాలను తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలతో బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి.ఇలా రెండు రాష్ట్రాల మధ్యన రాజకీయ వాతావరణం వేడెక్కిన తరుణంలో తెలంగాణ మంత్రులు ఐదుగురు.. జనసేన కేంద్ర కార్యాలయంలో దిగటం ప్రాధాన్యం సంతరించుకుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి జనసేన ఆఫీసు ప్రాంగణంలో కనిపించడం ఆసక్తి రేకెత్తించింది.అయితే వీరంతా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం హెలిప్యాడ్ వాడుకున్నట్లు తెలిసింది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రులంతా హెలికాప్టర్‌లో వెళ్లగా.. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా పిడుగు హరిప్రసాద్ జనసేన నేతలతో కలిసి తెలంగాణ మంత్రులకు స్వాగతం పలికారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

# భాగ్యనగరం... బాగుపడేదెప్పుడూ



హైదరాబాద్, ఆగస్టు 11, అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది "ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?" అన్న ఆందోళన.భాగ్యనగరం (హైదరాబాద్) వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి. అరగంట వానకే రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి, మాన్‌హోల్స్ కనిపించకుండా పోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు గంటల తరబడి కొనసాగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్నా, దానికి శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు.ఈ దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి.. హైదరాబాద్ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా పాతది మరియు విస్తరిస్తున్న నగర అవసరాలకు సరిపోవడం లేదు. జనాభా పెరగడం, కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల నీటి మళ్లింపు సరిగ్గా జరగడం లేదు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా, వాటికి అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కాలక్రమేణా నాలాలు, చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగి, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. వర్షాకాలానికి ముందు డ్రెయినేజీ క్లీనింగ్, రోడ్ల మరమ్మతులు చేస్తామనే వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి, వరదలు సంభవిస్తున్నాయి.ప్రతి వర్షాకాలం భాగ్యనగరం మునిగిపోకుండా ఉండాలంటే తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలను అమలు చేయాలి. నగర జనాభా, విస్తరణకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడం, పాత వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం. నాలాలు, చెరువుల చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంది. భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాజెక్టులలో డ్రెయినేజీ, నీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా చేర్చాలి.భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే, ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం తప్పనిసరి. వర్షం అంటే భయం కాకుండా, ఆనందం కలిగించే రోజు రావాలంటే, ఈ సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనడం అవసరం. లేకపోతే, వర్షాకాలంలో నగర ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి.

నరకం చూపించిన వాన

హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా కురిసిన వానకు జన జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అడుగు కదలడానికి గంటలు పట్టింది. హైటెక్ సిటీ ప్రాంతంలో అయితే మరింత నరకప్రాయం. ఎక్కడికక్కడ అధికారులు వెంటనే వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ మాత్రం ముందుకు కదల్లేరు. అర్ధరాత్రి వరకు వాహనదారులు రోడ్లపైనే జాగారం చేశారు. హైటెక్ సిటీ నుంచి హయత్ నగర్ వరకు అటు గాజులరామారం వరకు ఇటు శంషాబాద్ వరకు ఎక్కడ చూసినా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవైపు దంచి కొడుతున్న వాన మరోవైపు ముందుకు కదలని ట్రాఫిక్. నిజంగా ప్రయాణికులు బాధ వర్ణణాతీతం. రోడ్డుపై పారుతున్న వరద నీటిలో కొన్ని కార్లు కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రియల్ టైంలో పని చేసే అధికారులు కనిపించడం లేదని నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఆఫీస్ నుంచి వచ్చే వాళ్లది ఒక బాధ అయితే ఆఫీస్‌కు నైట్ షిఫ్టులకు వెళ్లే వాళ్లది మరో బాధ. షిఫ్టు టైం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటోలు క్లిక్ చేసి చలానాలు రాసే డిపార్ట్మెంట్‌గా ట్రాఫిక్ విభాగం పేరు తెచ్చుకుందే తప్ప రియల్ టైంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడుతున్నారు. ఇలా వర్షంలో చిక్కుకుపోతామని ఆఫీసుల్లోనే వాహనాలు వదిలి మెట్రోను ఆశ్రయించిన వారికి అక్కడ క్రౌడ్ చూసి బిత్తర పోయారు. అన్ని మెట్రో టెర్మినల్స్‌లో కూడా భారీ క్యూలు కనిపించాయి. వచ్చిన మెట్రోలు కిక్కిరిసిపోయాయి. ఏదోలా ఇంటికో ఆఫీస్‌కో చేరుకోవాలన్న ఆశతో నగరవాసులు మెట్రోలో ఇబ్బందిపడుతూనే ప్రయాణం చేశారు. కనీసం నిలబడేందుకు కూడా జాగా లేక సమస్యలు ఎదుర్కొన్నారు.ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించే వారిది మరో బాధ. క్యాబ్‌లు, ఆటోలు గంటల తరబడి బుక్ కాలేదు. అయినా కొందరు డ్రైవర్ల వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. రిజెక్టు కొట్టారు. ఇలా అన్ని వైపుల నుంచి నగర వాసులను వాన తెగ ఇబ్బంది పెట్టేసింది.

# రామచంద్రరావు బండి మార్క్...

హైదరాబాద్, ఆగస్టు 11, బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. పార్టీ వ్యవహారాలు జోరుగా సాగేవి. అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలంగాణకు అనేక పర్యాయాలు వచ్చారు.. తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. సంజయ్ కూడా పార్టీ కార్యకలాపాలను ఉధృతంగా సాగించేవారు. భారత రాష్ట్ర సమితి పరిపాలన కాలంలో బండి సంజయ్ రెండు పర్యాయాలు పోలీసుల చేతిలో అరెస్టు అయ్యారు. బండి సంజయ్ నాయకత్వంలోనే భారతీయ జనతా పార్టీ దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి తిరుగులేని పోటీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ రెండవ స్థానంలో నిలిచింది. హుజురాబాద్ ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఒకరకంగా బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో జవసత్వాలు కల్పించారని చెప్పుకోవచ్చు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధినాయకత్వం ఒకసారి గా బండి సంజయ్ ని తప్పించింది. ఆయన స్థానంలో కిషన్ రెడ్డి నియమించింది. ఆయినప్పటికీ భారతీయ జనతా పార్టీ 2018 ఎన్నికల తో పోల్చుకుంటే 2023లో గణనీయమైన ఫలితాలను సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 8 స్థానాలను సొంతం చేసుకుంది. అయితే బండి సంజయ్ కనుక తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా ఉంటే పార్లమెంటు స్థానాలు మరిన్ని పెరిగేవని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ఎందువల్ల బండి సంజయ్ ని మార్చాల్సివచ్చిందో ఇప్పటికీ క్లారిటీ లేదు. బండి సంజయ్ కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చినప్పటికీ.. ఇప్పటికీ కార్యకర్తల్లో సంజయ్ లేని లోటు కనిపిస్తూనే ఉంది.ఇటీవల రామచంద్రరావు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా నియమించింది. ఆయనకు అధ్యక్ష పదవిని ఇవ్వడాన్ని పార్టీలో కొంతమంది నాయకులు జీర్ణించుకోలేకపోయారు. నేరుగా తమ నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ బిజెపి కేంద్ర నాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. అయితే ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ కు పార్టీ కేంద్ర నాయకత్వం తేరలేపినట్టు కనిపిస్తోంది. అందువల్లే భారత రాష్ట్రసమితికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కాషాయ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. ఇంకా కొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు లైన్లో ఉన్నారని రామచంద్రరావు అంటున్నారు. ఒకవేళ గనుక ఇదే స్థాయిలో చేరికలు గనుక కొనసాగితే బిజెపి 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి బలపడుతుందని కాషాయ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు.. రామచంద్ర రావు బండి సంజయ్ మాదిరిగానే పార్టీలో దూకుడు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని వారు చర్చించుకుంటున్నారు.. ఒకవేళ రామచంద్రరావు సంజయ్ మాదిరిగానే జోరు కొనసాగిస్తే మాత్రం బిజెపికి తిరుగు ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# నేనా... రిటైర్మెంటా...



హైదరాబాద్, ఆగస్టు 11, ట్రెండ్‌కు అనుగుణంగా వెళ్లే నేతల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకరు. ట్రెండ్‌కు తగ్గట్టుగా మాటలు ఆడుతారు. తనపై మీడియాలో చర్చ జరిగేలా చేస్తారు. చివరకు తాను అలా అనలేదంటూ సెటైర్‌గా చెప్పడం వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు అదే చేశారాయన. తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన వ్యక్తుల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకరు. పాలు అమ్మిన దగ్గర నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన, వ్యాపారవేత్తగా రాణించారు. ఆ తర్వాత విద్యాసంస్థలను స్థాపించారు. చివరకు రాజకీయ నేతగా మారారు. ఆయన నెక్స్ట్ ఏంటన్నది ఎవరికీ తెలీదు. రాజకీయాలకు దూరంగా ఉంటానని శనివారం చెప్పారు. మరుసటి రోజు ఆదివారం నాటికి మాట మార్చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటారని అన్నారని, వారసత్వం ఏమైనా కొనసాగిస్తారా? అంటూ మీడియా లేవనెత్తిన ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు ఎమ్మెల్యే మల్లారెడ్డి. తాను దూరంగా ఉంటానని అనలేదని, స్పీడ్‌లో ఆ విధంగా మెసేజ్ జారి పోయిందన్నారు. ఓ జర్నలిస్ట్ అడిగి ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చానని తెలిపారు. మీరు టీడీపీలోకి వెళ్తారా? బీజేపీలోకి వెళ్తారా? తాను దేశంలోకి వెళ్లనని చెప్పానని, శనివారం చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదన్నారు. విద్యాసంస్థలను దేశవ్యాప్తంగా ప్రారంభిస్తానని చెప్పానని తెలిపారు. జపాన్‌లో రిటైర్మెంట్ లేదని, తనకు రిటైర్మెంట్ లేదని చెప్పకనే చెప్పారు మల్లారెడ్డి. చివరకు తాను రాజకీయాల నుంచి తప్పుకునేది లేదని మనసులోని మాట బయటపెట్టారు మల్లారెడ్డి. ఆ రోజు ఏ పార్టీలో ఉంటానన్నది బయట పెట్టలేదు. బీఆర్ఎస్‌లో కంటిన్యూ అవుతారా? మరో పార్టీ వైపు చూస్తారా? అనేది చెప్పలేదు. టీడీపీ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి టీడీపీ ఎంపీగా గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత తెలంగాణలో మారిన రాజకీయాల నేపథ్యంలో బీఆర్ఎస్ వైపు వెళ్లారు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేశారు. ఆయన కున్న పాత పరిచయాలతో అన్నిపార్టీల అధినేతలతో టచ్‌లో ఉన్నారు. రేపటి రోజున పరిస్థితుల బట్టి మారిపోయే ఛాన్స్ లేకపోలేదు. గతంలో అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాని వెనుక సారాంశం ఏంటో తెలీదు. కాకపోతే ఆయన టీడీపీలోకి వెళ్తారంటే జోరుగా ప్రచారం సాగింది. బంధువుల పెళ్లి నేపథ్యంలో శుభలేఖ ఇవ్వడానికి వెళ్లానని అన్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇప్పుడు ఈ విధంగా వ్యాఖ్యలు చేశారు. చివరకు మల్లన్న రూటు ఎటు? కంఫర్ట్‌గా ఉందని కారులో కంటిన్యూ అవుతారా? లేక మరేదైనా పార్టీ వైపు చూస్తున్నారా? అనేది ఆయన నోటి వెంట రాలేదు. అప్పుడప్పుడు అలా మీడియా ముందుకొచ్చి తాను ఉన్నానంటూ నేతలకు గుర్తు చేస్తున్నారని అంటున్నారు కొందరు నేతలు.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...

హైదరాబాద్, ఆగస్టు 11,కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది.కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది.డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది.యూనివర్సిటీ నినాదం "ఇటబీఇ-జీబితినీని జీబి ఎనీబీతీ టనీనీతీబబివజూ"కు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు.ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. 40-23680333 / 040-23680555.. కాల్ సెంటర్ : 1800 5990 101 లేదా వెబ్ సైట్.. లిలిలి.ఎతీజీనీబీ.జీఇ.తిని । లిలిలి.నీనిశ్రీతినివ.ఎతీజీనీబీ.జీఇ.తినిను సంప్రదించవచ్చు.

## యూరియా ప్రక్క దారి పట్టకుండా పటిష్టమైన చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 11 :** జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని,యూరియా ప్రక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు,జిల్లా ఉద్యానవన అధికారి అనిత లతో కలిసి మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణాధికారులు, ఉద్యానవన- పట్టు పరిశ్రమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని,కృత్రిమ కొరత సృష్టించడం,యూరియాను ప్రక్క దారి పట్టించడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.యూరియా అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో చేస్తున్న పత్తి సాగు విస్తీర్ణానికి అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని,అంచనా పంట దిగుబడి కంటే కొనుగోలు అధికంగా జరుగుతుందని, ఈ క్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు పంట సాగు,దిగుబడి సంబంధించి రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోగా వరి ధాన్యం సాగు ప్రారంభించాలని,సాగు ప్రారంభం కాని పక్షంలో ఇతర పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పత్తి పంట సాగులో అంతర పంటగా మునగ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, మునగ అంతర పంట సాగుకు ఉ పాధిహామీ పథకం క్రింద గుంతలు,మొక్కలు నాటడం, నీటి సరఫరాకు సంబంధించి నగదు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 70 ఎకరాల నుండి 300 ఎకరాలకు పెరిగిందని, అవసరం ఉన్న చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మొక్కజొన్నతో పాటు కందులు, పెసలు, మినుముల పంట సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు.ఆయిల్ పామ్ విస్తీర్ణంలో నమోదు చేసుకున్న విస్తీర్ణం కంటే సాగు విస్తీర్ణం తక్కువగా ఉందని,ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలని, ఆర్.ఓ.ఎఫ్.ఆర్.పోడు భూములలో ఆయిల్పామ్ పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.వరి ధాన్యం పంట కోత నవంబర్ మొదటి వారం నుండి ప్రారంభించేందుకు అనుగుణంగా సాగు చేసేలా రైతులకు వివరించాలని, తద్వారా డిసెంబర్ నెలలో అకాల వర్షాల నుండి పంటను కాపాడుకునేందుకు వీలు ఉంటుందని తెలిపారు. రైతు భీమా పథకంలో రైతుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, రైతు భీమా లబ్దిదారులకు జాతీయ కుటుంబ సంక్షేమ పథకం క్రింద 18-50 సంవత్సరంల వయస్సు వరకు పరిహారం వస్తున్నందున,లబ్దిదారులు సంబంధిత తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మ్యాట్రిక్స్ సి.ఈ.ఓ.ఉదయ్ కుమార్,సంబంధిత అధికారులు,మ్యాట్రిక్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కూడా అందించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉంది.

## బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్. చల్మెడ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సమైక్య రాష్ట్ర పరిస్థితులు పునరావృత్తం అవుతున్నాయని, రైతులు పడుతున్న, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, అన్నదాతలకు మద్దతుగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని, యూరియా సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టతనివ్వాలని చల్మెడ డిమాండ్ చేశారు.

రైతులకు కనీసం పంటకు నీరు అందించకపోగా ఆరుగాలం కష్టపడి సాగు చేసుకున్న పంటలకు యూరియా కూడా అందించలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చల్మెడ మండిపడ్డారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెలకొన్న యూరియా సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడంతోపాటుగా, రైతుల అవసరాలకు సరిపడే విధంగా యూరియా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, పంటల వివరాలు సేకరించి అవసరమయ్యే ఎరువులపై ముందస్తు ప్రణాళిక చేయాల్సి ఉంటుందని సూచిస్తూ, జిల్లాలో ముందస్తు ప్రణాళిక చేయకపోవడం వల్లే బస్తా యూరియా కోసం గంటల తరబడి అర్ధరాత్రి వరకు వేచి ఉండవలసిన పరిస్థితులకు కారణమైన యంత్రాంగం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గత నాలుగైదు రోజులుగా అన్నదాతలు యూరియా కోసం నానా అవస్థలు పడుతుంటే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఘాటుగా విమర్శించారు. నాలుగు రోజుల క్రితం ఆయన సొంత గ్రామం రుద్రంగిలో యూరియా కోసం అన్నదాతలు దాదాపుగా 10 గంటల పాటు నిరీక్షణ చేసిన విషయం తెలిసి కూడా ఆయన స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్య బయటకు రాగానే ఒక విప్ గా యుద్ధ ప్రాతిపదిక కలెక్టర్, ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, జిల్లాకు కావలసిన యూరియా ఎంత, ఎంత వచ్చింది, ఇంకా ఎంత రావాల్సి ఉంది, అలాగే కొరత ఏర్పడేందుకు కారణాలు ఏమిటి, లోపాలు ఎక్కడున్నాయి అనే అంశాలను లోతుగా పరిశీలించి పరిష్కారం చేయవలసిన వారు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

## సివిక్ కాంట్రాక్టు కార్మికులకు సెఫ్టీ పరికరాలు అందజేత

## ధన్యవాదాలు తెలిపిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 11** మంచిర్యాల జిల్లా మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సివిక్ కాంట్రాక్టు కార్మికులకు సెఫ్టీ పరికరాలు అందించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం తరపున అనేక సార్లు అధికారులకు మెమోరాండాలు ఇచ్చామని ఇటీవల పనిచేస్తున్న క్రమంలో సివిక్ కాంట్రాక్టు కార్మికుడు పాము కాటుకు గురవడం జరిగిందన్నారు. ఆ ప్రమాదానికి ప్రధాన కారణం కార్మికులకు సెఫ్టీ పరికరాలు అందించడంలో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియుగా తీవ్రంగా ఖండించడంతో వెంటనే అధికారులు కూడా స్పందించి కాంట్రాకర్లతో మాట్లాడి సివిక్ కాంట్రాక్టు కార్మికులందరికి సెఫ్టీ పరికరాలు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్పందించిన సివిల్ అధికారులకు, కాంట్రాక్టర్లకు కాంట్రాక్టు కార్మికులందరి తరుపున అలాగే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

చొప్పదండి పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం ఆదేశానుసారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చొప్పదండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపట్టిన అభివృద్ధి పనులను పలువురు నేతలు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘణ విజయం సాధిస్తారని తెలిపారు.ప్రతి కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వొడ్నాల యఘ్నేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా నాయకులు రామిడి రాజిరెడ్డి,దుబ్బాసి బుచ్చయ్య,కంకనాల రాజ గోపాల్ రెడ్డి,పడితపెల్లి కిషన్, శేఖర్ రెడ్డి,దూలం విరేశం గౌడ్,గుజ్జుల బాపు రెడ్డి,పెంచాల చందు,అంజి రెడ్డి,సాగి అజయ్ రావు,మ్యాక వినోద్, గ్రామ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ గడ్డం అంజయ్య,గడ్డం లక్ష్మణ్ జానీ, విలాసాగరం గంగయ్య, గడ్డం కొండయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు భవిత కేంద్రాలు

## భవిత కేంద్రం రూపు రేఖలు మార్చే దిశగా పటిష్ట చర్యలు

## 14 లక్షల వ్యయంతో మౌలిక వసతుల కల్పన



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)మెదక్ జిల్లా:**మెదక్/సోమవారం నాడు భవిత కేంద్రాన్ని పరిశీలించి ఎఫ్ఎల్ఎన్ కార్యచరణ ప్రణాళిక టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్,భవిత కేంద్రం రూపు రేఖలు మార్చి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు,జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ పక్కన ఉన్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు,భవిత కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ,సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు,దివ్యాంగ పిల్లల్లో నైపుణ్యాలు పెంచేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ అన్నారు,అనంతరం 14 లక్షల వ్యయంతో నిర్మాణ దశలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి త్వరితగతినపూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు,ఎఫ్ఎల్ఎన్ కార్యచరణ ప్రణాళిక టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించి సంబంధిత వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ ను అడిగి తెలుసుకున్నారు,ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ భవిత కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## నాటిన ప్రతి ఒక చెట్టు బ్రతకాలి

## బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి



**ప్రజాబలం కొల్చారం.మండలం ఆగస్టు 11** మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటాపూర్ ఫారెస్ట్ లో వర్షాలు లేక ముందుగా డంప్ చేసుకున్న చెట్లకు మూడు నాలుగు రోజులు నీళ్లు పోసి కుప్పలుగా ఉంచిన చెట్లను వర్షాలు పడడంతో చెట్లను వెంకటాపూర్ బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో చెట్లను నాటించారు అనంతరం బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి మాట్లాడుతూ నాటిన ప్రతి ఒక్క చెట్టు బతకాలని ప్రతి చెట్టును సంరక్షించాలని తెలిపారు చెట్లు నాటిన ప్రతి ఒక్క కవరు కుప్పలుగా చేసి కాల్చాలని తెలిపారు చెట్ల వలన పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని పేర్కొన్నారు ప్రతి ఒక్కరూ చెట్లను నాటిన ప్లాంటేషన్ లో గొర్రెలు కానీ మేకలు కానీ గేదెలను తీసుకువెళ్లద్దని అన్నారు

## సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది.

## పాల్గొన్న నీటిపారుదల శాఖ అధికారులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాదులో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, పలు ఏజెన్సీ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, కలికోట నుండి కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడుమ కాల్వ కోసం భూసేకరణ, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి ప్రాజెక్టు పనులు, కొనరావుపేట మండల పరిధిలోని లచ్చపేట తండా రిజర్వాయర్ కాల్వ పనులు, చందుర్తి మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చెరువు, సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువులోకి నీటితో నింపే ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని, రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల నుండి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సి ఈ సుధాకర్ రెడ్డి, ఈ ఈ సంతు ప్రకాష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## హర్ దిల్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా..

ప్రతి మదిలో, ప్రతి ఇంటిపైనా దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోందని.. ప్రతి గుండె ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పంద్రాగస్టు వేడుకులకు సిద్ధమవుతున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయవాడ ఓల్డ్ జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు వాకర్స్ క్లబ్ వంటి వివిధ అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బైక్, సైకిల్ ర్యాలీతో పాటు స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్రివర్ణపతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, ఓల్డ్ జీజీహెచ్ రహదారులు మార్మోగిపోయాయి. అమరవీరుల బలిదానం.. నేటి స్వేచ్ఛా భారతం, త్రివర్ణ పతాకం ఐకమత్యానికి సంకేతం నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సరిహద్దుల్లో మన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని.. ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఏదో ఒక రోజుకి పరిమితం కాకుండా ప్రతి హృదయమూ త్రివర్ణ పతాక ఐక్యతా స్ఫూర్తిని నింపుకొని ప్రతిరోజూ ముందడుగు వేయాలని, ప్రతిఒక్కరూ దేశ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి గొప్ప కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నందుకు గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్వేచ్ఛ.. ఎందరో మహనీయుల త్యాగ ఫలితం: సీపీ ఎస్వీ రాజశేఖరబాబుమనం నేడు అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితమని.. మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో రంగాల్లో ముందుకెళ్లామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దేశమంటే మాతృమూర్తితో సమానమని.. దేశభక్తితో దేశాభివృద్ధికీ ప్రతిఒక్కరూ సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రగతి పథంలో వడివడిగా ముందడుగు వేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని రాజశేఖరబాబు అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం మరియు కువైట్ మధ్య పెరుగుతున్న సంబంధాలు: ముస్లింలు అధికంగా ఉన్న మధ్యప్రాచ్యంలో భారతదేశం యొక్క పెరుగుతున్న ప్రభావ పరిధికి నిదర్శనం.

భారతదేశ విదేశాంగ విధానం గణనీయమైన పరివర్తనకు గురైంది, ముఖ్యంగా మధ్యప్రాచ్యంతో – ముఖ్యంగా గల్ఫ్ దేశాలతో సంబంధాలను మరింతగా పెంచుకునే దిశగా వ్యూహాత్మక మలుపు ద్వారా ఇది గుర్తించబడింది. ఇటీవలి సంవత్సరాలలో, భారతదేశం ఆర్థికం, సాంకేతికత, రక్షణ మరియు నిఘా భాగస్వామ్యం రంగాలలో యుఎఇ మరియు సౌదీ అరేబియాతో తన వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకుంది. "అన్ని వాతావరణ స్నేహాలను నిర్మించే ఈ ప్రయత్నంలో, కువైట్‌తో న్యూఢిల్లీ యొక్క పెరుగుతున్న భాగస్వామ్యం ముస్లిం-మెజారిటీ ప్రాంతంలో దాని విస్తరిస్తున్న ప్రభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. చారిత్రక వాణిజ్య సంబంధాలు మరియు సాంస్కృతిక మార్పిడిలో పాతుకుపోయిన భారతదేశం-కువైట్ సంబంధం ఇంధన భద్రత, ఆర్థిక సహకారం మరియు భౌగోళిక రాజకీయ అమరికను విస్తరించింది. కేవలం ద్వైపాక్షిక విజయగాథగా కాకుండా, ఈ సంబంధాలు మధ్యప్రాచ్యంలో కీలక పాత్ర పోషించే భారతదేశం యొక్క ఆచరణాత్మక విదేశాంగ విధానాన్ని ప్రతిబింబిస్తాయి.

భారతదేశం మరియు కువైట్ మధ్య సుదీర్ఘమైన పరస్పర సంబంధాల చరిత్ర ఉంది, ఇది సింధు లోయ నాగరికత వరకు విస్తరించి ఉంది. ఆధునిక సంబంధం 20వ శతాబ్దం మధ్యలో రూపుదిద్దుకుంది. దౌత్య సంబంధాలు 1962లో స్థాపించబడ్డాయి, బ్రిటిష్ పాలన నుండి కువైట్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన మొదటి దేశాలలో భారతదేశం కూడా ఉంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఉన్నత స్థాయి సందర్శనలు కీలక పాత్ర పోషించాయి. విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఆగస్టు 2024లో కువైట్‌ను సందర్శించగా, కువైట్ విదేశాంగ మంత్రి డాక్టర్ షేక్ అహ్మద్ నాసర్ అల్-మొహమ్మద్ అల్-సబా మార్చి 2021లో భారతదేశాన్ని సందర్శించారు. 2021-22లో, రెండు దేశాలు 200 కంటే ఎక్కువ సాంస్కృతిక కార్యక్రమాలతో దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నాయి, ఇది శాశ్వత సద్భావన మరియు ఉమ్మడి ఆసక్తులను నొక్కి చెబుతుంది. భారతదేశం-కువైట్ సంబంధాలకు కీలకమైన స్థంభం పెద్ద భారతీయ డయాస్పోరా, ఇది కువైట్‌లో దాదాపు పది లక్షల మందిగా అంచనా వేయబడింది - ఇది అతిపెద్ద ప్రవాస సమాజం. నిర్మాణ, ఆరోగ్య సంరక్షణ, ఐటీ మొదలైన రంగాలలో పనిచేస్తూ, ఈ వ్యక్తులు ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తారు మరియు కువైట్ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడతారు. వారి ఉనికి ద్వైపాక్షిక సహకారానికి బలమైన పునాదిని నిర్మించింది మరియు ఈ సంబంధం అధికారిక ఒప్పందాలను అధిగమించి, రెండు దేశాల దైనందిన జీవితంలోకి ప్రవేశిస్తుందని నిర్ధారిస్తుంది.

భారతదేశం-కువైట్ భాగస్వామ్యానికి ఇంధన భద్రత చాలా కీలకమైనది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు ఉత్పత్తిదారులలో కువైట్ ఒకటి మరియు భారతదేశానికి కీలకమైన సరఫరాదారు. 2022లో, భారతదేశం యొక్క మొత్తం ముడి చమురు దిగుమతుల్లో కువైట్ దాదాపు 10% వాటాను కలిగి ఉంది, ఇది భారతదేశపు టాప్ ఐదు ఉత్పత్తిదారులలో ఒకటిగా నిలిచింది. COVID-19 మహమ్మారి సమయంలో, ప్రపంచ ఇంధన మార్కెట్లు అస్థిరతతో కుదేలైనప్పుడు ఈ పరస్పర ఆధారపడటం పరీక్షించబడింది. కువైట్ యొక్క స్థిరమైన సరఫరా భారతదేశం యొక్క విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి సహాయపడింది, చమురు అన్వేషణ, శుద్ధి మరియు పెట్రోకెమికల్స్‌లో జాయింట్ వెంచర్‌లపై చర్చలను ప్రేరేపించింది - ఇంధన బంధాన్ని మరింత పటిష్టం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి, కువైట్ భారతదేశం యొక్క 9వ అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగింది, భారతదేశ ఇంధన అవసరాలలో దాదాపు 3% తీరుస్తోంది. శక్తి మూలస్తంభంగా ఉన్నప్పటికీ, సంబంధం విస్తృత శ్రేణి ఆర్థిక నిశ్చితార్థాన్ని కలిగి ఉండటానికి విస్తరించింది. 2018-19లో $8.5 బిలియన్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం S2022-23లో $ 12.5 బిలియన్లకు పెరిగి, 2023-24లో $10.47 బిలియన్లకు చేరుకుంది. కువైట్‌కు భారతదేశం ఎగుమతుల్లో వస్త్రాలు, యంత్రాలు, తృణధాన్యాలు, సేంద్రీయ రసాయనాలు, వాహనాలు మరియు విద్యుత్ యంత్రాలు ఉన్నాయి: భారతదేశానికి కువైట్ ఎగుమతులు చమురు మరియు పెట్రోకెమికల్స్‌పై కేంద్రీకృతమై ఉన్నాయి. 2006లో స్థాపించబడిన మరియు 2021లో విదేశాంగ మంత్రుల స్థాయికి ఎదిగిన జాయింట్ మినిస్టీరియల్ కమిషన్ (JMC), వాణిజ్య సులభతరం మరియు పెట్టుబడి ప్రమోషన్ నుండి సాంకేతిక బదిలీ వరకు కొత్త సహకార రంగాలను అన్వేషించడానికి క్రమం తప్పకుండా సమావేశమవుతుంది. కువైట్ జాతీయ అభివృద్ధి ప్రణాళిక, విజన్ 2035, చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఐటీ, పునరుత్పాదక ఇంధనం మరియు మౌలిక సదుపాయాలలో భారతదేశ నైపుణ్యంతో ముడిపడి ఉండటం లక్ష్యంగా పెట్టుకుంది. L&T, Wipro. మరియు Tata వంటి భారతీయ సంస్థలు స్మార్ట్ సిటీల నుండి క్లీన్ ఎనర్జీ వరకు కువైట్ యొక్క మౌలిక సదుపాయాల వెంచర్లలో ఆసక్తిని కనబరిచాయి. ఇంతలో, కువైట్ పెట్టుబడిదారులు రియల్ ఎస్టేట్, ఆరోగ్య సంరక్షణ మరియు స్టార్టప్‌లతో సహా భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న రంగాలపై దృష్టి సారించారు. 2019లో, కువైట్ ప్రధానమంత్రి షేక్ సబా అల్-ఖలీద్ అల్-సబా భారతదేశాన్ని సందర్శించారు, ఫలితంగా వాణిజ్యం, పెట్టుబడులను పెంచడానికి కీలక ఒప్పందాలు కుదిరాయి. విదేశాంగ కార్యాలయ సంప్రదింపులు (FOCలు) - ఇటీవల జూలై 2024లో 6వ రౌండ్ - ఆర్థిక సంబంధాలను మరింత మెరుగుపరుస్తాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో,శామ్సంగ్ ట్రిపుల్ కెమెరా Galaxy F41 తో తీసినది భారతదేశ ఎగుమతులు 34.7% పెరిగి $1.56 బిలియన్ల నుండి %వి%2.1 బిలియన్లకు చేరుకున్నాయి, ఇది బలమైన పెరుగుదల పథాన్ని ప్రతిబింబిస్తుంది.

ఆర్థిక శాస్త్రం మరియు శక్తి రంగాలకు అతీతంగా, భారతదేశం మరియు కువైట్ మధ్యప్రాచ్యంలో శాంతి, స్థిరత్వం మరియు అభివృద్ధికి నిబద్ధతను పంచుకుంటాయి. భారతదేశం యొక్క 'లుక్ వెస్ట్' విధానం గల్ఫ్ వ్యవహారాలలో తటస్థ, ఆచరణాత్మక మధ్యవర్తిగా కువైట్ యొక్క ఖ్యాతికి అనుగుణంగా ఉంటుంది. రెండూ సాంప్రదాయకంగా ఈ ప్రాంత సంక్లిష్టతలకు సమతుల్య విధానాన్ని కొనసాగించాయి. ముఖ్యంగా నిఘా భాగస్వామ్యం మరియు రాడికలైజేషన్ ప్రయత్నాలలో ఉగ్రవాద నిరోధక సహకారం చాలా కీలకం, ముఖ్యంగా కువైట్ యొక్క పెద్ద భారతీయ డయాస్పోరా, చురుకైన చర్యల కారణంగా తీవ్రవాద ప్రభావం నుండి ఎక్కువగా విముక్తి పొందింది. రెండు దేశాలు బహుపాక్షికత మరియు నియమాల ఆధారిత అంతర్జాతీయ క్రమాన్ని కూడా సమర్థిస్తాయి. ఐక్యరాజ్యసమితి వంటి ప్రపంచ సంస్థలలో సంస్కరణలను సమర్థించడం. UN భద్రతా మండలిలో శాశ్వత స్థానం కోసం భారతదేశం యొక్క ప్రయత్నాన్ని కువైట్ ఆమోదించడం వారి వ్యూహాత్మక భాగస్వామ్యం యొక్క లోతును వివరిస్తుంది. సాంస్కృతిక మరియు విద్యా మార్పిడి ద్వారా భాగస్వామ్యం మరింత సుసంపన్నం చేయబడింది. భారతదేశం-కువైట్ స్నేహ దినోత్సవం వంటి వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలు భాగస్వామ్య వారసత్వాన్ని హైలైట్ చేస్తాయి మరియు స్టీరియోటైప్‌లను తొలగించడంలో సహాయపడతాయి. కువైట్‌లోని 26 కి పైగా పాఠశాలలు భారతదేశ CBSE పాఠ్యాంశాలను అనుసరిస్తాయి, వివిధ దేశాలకు చెందిన 60,000ం విద్యార్థులకు సేవలు అందిస్తున్నాయి. భారతీయ విశ్వవిద్యాలయాలు కువైట్‌లో క్యాంపస్‌లను స్థాపించడంలో ఆసక్తి చూపాయి, అయితే విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు సాఫ్ట్-పవర్ సంబంధాలను బలోపేతం చేస్తాయి. సెప్టెంబర్ 2024లో, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ICCR) మరియు కువైట్‌లోని గల్ఫ్ యూనివర్సిటీ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (GUST) హిందీ బోధన కోసం ICCR చైర్ ఆఫ్ ఇండియన్ స్టడీస్‌ను రూపొందించడానికి ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. బహుళ కువైట్ సంస్థలలో "ఇండియా కార్నర్స్" ఏర్పాటు విద్యా మరియు సాంస్కృతిక మార్పిడిని పెంపొందిస్తుంది.

భారతదేశం మరియు కువైట్ మధ్య పెరుగుతున్న సంబంధాలు ముస్లింలు అధికంగా ఉన్న మధ్యప్రాచ్యంలో భారతదేశం యొక్క విస్తరిస్తున్న ప్రభావ రంగాన్ని నొక్కి చెబుతున్నాయి. చారిత్రక సంబంధాలు, ఇంధన భద్రత, ఆర్థిక సహకారం మరియు భౌగోళిక రాజకీయ సినర్జీలలో లంగరు వేయబడిన ఈ భాగస్వామ్యం, ఈ ప్రాంతం కోసం న్యూఢిల్లీ యొక్క విస్తృత వ్యూహాన్ని వివరిస్తుంది. భారతదేశం పశ్చిమ ఆసియా అంతటా తన అడుగుజాడలను మరింతగా పెంచుకుంటూనే, కువైట్ దాని విదేశాంగ విధానానికి మూలస్తంభంగా ఉంది. శాంతి, స్థిరత్వం మరియు శ్రేయస్సు పట్ల పరస్పర అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. మారుతున్న పొత్తులు మరియు భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ద్వారా పెరుగుతున్న ప్రపంచంలో, భారతదేశం-కువైట్ సంబంధం ఒక దీపస్తంభంగా నిలుస్తుంది - రెండు దేశాలు విభేదాలను ఎలా తగ్గించవచ్చో, విశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చో మరియు ఉమ్మడి లక్ష్యాల వైపు సమిష్టిగా ఎలా పని చేయవచ్చో చూపిస్తుంది.

- అల్తాఫ్ మీర్.
జామియా మిలియా ఇస్లామియాలో పీహెచ్‌డీ

## రంగంపేట తిరుమల రైస్ మిల్ లో చోరీ



**ప్రజాబలం కొల్చారం మండలం ఆగస్టు 10** మెదక్ జిల్లా కొల్చారం మండలంలో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారులోని తిరుమల రైస్ మిల్ లో అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. తిరుమల రైస్ మిల్ ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి లోనికి చదవబడిన దొంగలు బీరువాలో ఉన్న సుమారు నాలుగు లక్షల రూపాయలు చోరీకి పాల్పడినట్టు బాధితుడు ముప్పుడి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహియోద్దీన్ విచారణ చేపట్టారు. క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరిస్తున్నా

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



**ఆగస్టు 11, 2025 నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి :-** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులంతా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి వచ్చిన ఉపాధ్యాయుల ఫేసియల్ రికగ్నైజింగ్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు.



ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** రాఖీ పండుగ ను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, చిన్నారులు, , జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు రాఖీ కడుతున్న దృశ్యం

అనంతరం బ్రహ్మ కుమారిస్ ఓం శాంతి ,ఆధ్వర్యం లో రెండు నిమిషాలు మెడిటేషన్ చేశారు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రజాబలం ప్రతినిధి:** సోమవారం ఐడిఓసి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక ప్రదర్శనలు, భద్రతా ఏర్పాట్లు, వేదిక అలంకరణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అసెట్స్ పంపిణీకి లబ్దిదారుల జాబితా తయారు చేయాలన్నారు. డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరిగే ఈ కార్యక్రమాలకు షామియానా, కుర్చీలు, వైద్య కేంద్రం, అంబులెన్స్, మంచినీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాళ్లు ఏర్పాటుకు డిఆర్డీఓ కు జాబితా ఇవ్వాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు మినిట్ టు మినిట్ సజావుగా సక్రమంగా నిర్వహించుటకు ఆర్డిఓ పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారు లు తదితరులు పాల్గొన్నారు

## యూరియా కోసం రైతుల అందోళన

కరీంనగర్ హుజూరాబాద్ నియోజకవర్గం లో యూరియా కోసం అన్నదాతలు ఆందోళనకు దిగారు. హుజూరాబాద్ సొసైటీ లో వేకువజాము నుండే భారీ క్యూ లైన్ కట్టారు. వీణవంక మండలం నర్సింగపూర్ లో రైతులు రోడ్డెక్కారు. జమ్మికుంట - కరీంనగర్ రహదారి పై ధర్నా రాస్తారోకో చేసారు. రైతులకు యూరియా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేసారు.

# ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.





సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్, గైర్హాజరైన అధికారుల జాబితాను పరిశీలించి, సంబంధిత అధికారికి వెంటనే మెమోలు జారీ చేయాలని ఏఓను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కల్లెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.



**వికారాబాద్ ప్రజాబలం ప్రతినిధి: 11-8-2025** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికివచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 84 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ భూ సమస్య లు,ఇందిరమ్మ ఇల్లు ,ఎలక్ట్రిసిటీ , గ్రామ పంచాయతి , విద్యా శాఖ, ఆసరా పెన్షన్ లకు సంబందించి ఫిర్యాదు లు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

సి ఎం ఓ ప్రజావాణి కి జిల్లా పై వచ్చిన ప్రజా ఫిర్యాదు లను చెక్ చేసి దరఖాస్తు ఎ ప్రాసెస్ లో ఉందొ చెక్ చేసి ఆన్లైన్ అప్డేట్ చేయాలనీ ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు.కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరు సమయ పాలన పాటిస్తూ అటెండన్స్ తప్పనిసరిగా ఉండాలని, మిగతా అందరు అధికారులు కూడా అటెండన్స్ రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు సమన్వయ ముతో ఘనంగా ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి , ఆర్ డి ఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎ ఓ, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలితో రాఖీ కట్టించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)**మెదక్ జిల్లా:మెదక్/ప్రజావాణి హాలులో దివ్యాంగురాలితో రాఖీ కట్టించుకుని సోదర భావాన్ని తెలిపిన కలెక్టర్,ప్రజావాణి హాలు నందు ప్రజా సమస్యలపై ప్రజల నుండి దరఖాస్తులు జిల్లా కలెక్టర్ స్వీకరించారు,అదే సందర్భంలో దివ్యాంగురాలు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరులో నెలకొన్న సమస్యలను కలెక్టర్కు మొరపెట్టుకున్నారు,వెంటనే కలెక్టర్ స్పందించి నిబంధనలు అర్హతలు పరిశీలించాలని డిఎల్ పిఓ ను ఆదేశించారు.అనంతరం దివ్యాంగురాలు కలెక్టర్ కు రాఖీ కట్టాలని వచ్చిన వికలాంగ సోదరీమణులను చూసి చేలించిన కలెక్టర్ వెంటనే కుర్చీలోంచి లేచి వచ్చిరాఖీ కట్టించుకుని శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోదరీ సోదరీమణుల అనుబంధాలను ప్రేమానురాగాలను పంచుకోవడానికి రాఖీ పండుగ అద్దం పడుతుందని ప్రేమ ఆప్యాయత అనేది చాటి చెప్పడానికి వైకల్యం అనేది అడ్డు రాదని ఇది ప్రతి ఒక్కరి హృదయాల్లో పది కాలాలపాటు పదిలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## వాసాల శంకర్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 11:**సింగరేణి రిటైర్మెంట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ ను మాజీ ప్రభుత్వ విప్ చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంకు గురైన వాసాల శంకర్ హైదరాబాదులో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ విప్, చెన్నూరు మాజీ శాసనసభ్యులు నల్లాల ఓదెలు సోమవారం శంకర్ ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయనకు సూచించారు. వీరి వెంట సంగి రవి, శనిగారపు కుమార్, తుంగపిండి శంకర్, అవునూరి పోశం, పల్లె సమ్మయ్య, అసం కొమురయ్య, ఆరుముల్ల నరసింగరావు, ఈర్ల సర్జన్, వేల్పుల రవి లు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా నిర్వహించాలి:కలెక్టర్ పి.ప్రావీణ్య




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/స్వాతంత్ర దినోత్సవం వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు,సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్,సన్నాహక సమావేశం నిర్వహించారు,పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు,వేదిక సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని వర్షాలు కురుస్తున్నందున వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించాలని సూచించారు,అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని,108 అంబులెన్స్ ను వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు,వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు,రెవిన్యూ ,పోలీస్ , అగ్నిమాపక,పంచాయతీరాజ్, విద్యాశాఖ,వైద్య ఆరోగ్య,వ్యవసాయ,జిల్లా గ్రామీణాభివృద్ధి,పురపాలక,ఫారెస్ట్, పశు సంవర్ధక,తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు,అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు,పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు,ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు,ఈ సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్,మాధురి,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జడ్పీ సీఈఓ జానకి రెడ్డి ,సి పి ఓ బాలశౌరి , వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కి 40 దరఖాస్తులు
## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా అధికారులను ఆదేశించారు,సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 40 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు,సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్,మాధురి,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు,అందిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు,ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తుపై రికార్డు నిర్వహణ చేపట్టి ప్రతి ఫిర్యాదు పరిష్కారం అయ్యేవరకు ఫాలోఅప్ అని తెలిపారు,ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారం కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రతకు షీ టీమ్ అండ -మందమర్రి ఎస్ఐ శివనీతి రాజశేఖర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 11:**విద్యార్థినులకు షీ టీం అండగా ఉంటుందని మందమర్రి పట్టణ ఎస్.ఐ శివనీతి రాజశేఖర్ తెలిపారు. సోమవారం మందమర్రి పట్టణంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో "షీ టీమ్" ఆవశ్యకతపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ మరియు మంచిర్యాల షీ టీం ఎస్ఐ ఉష ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంచిర్యాల షీ టీం ఎస్ఐ ఉష మాట్లాడుతూ, మహిళలు, యువతులు, మరియు విద్యార్థినులను వేధింపుల నుండి రక్షించేందుకే షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాపులు, పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో ఉంటూ ఆకతాయిల ఆగడాలను అరికట్టడమే షీ టీమ్స్ ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా, వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఆమె భరోసా ఇచ్చారు.



అనంతరం మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో చదువుపై దృష్టి సారించాలని, వారి రక్షణ బాధ్యతను పోలీసులు తీసుకుంటారని అన్నారు. ఆపద సమయంలో నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని, షీ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మందమర్రి పోలీస్ సిబ్బంది, మరియు విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ కి భాధ్యతలు గుర్తు చేస్తే దేశ ద్రోహులు అవుతామా సత్యం శ్రీరంగం సూటి ప్రశ్న

**దేశంలోని పలు రాష్ట్రాలలో ఎన్నికల సంఘం (ఈసీ) తో కలసి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడింది...**




**కూకట్పల్లి (ప్రజబలం) ఆగస్టు 11:**లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసే ఓట్ చోరీ పోరాటంలో యువత, ప్రజలు భాగస్వామ్యం కావాలి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పిలుపు ఎన్నికల కమిషన్ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా,లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓట్ చోరీ ప్రజా ఉద్యమంకి మద్దతుగా గాంధీ భవన్ లో పత్రిక సమావేశంలో మాట్లాడిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. మాట్లాడుతూ సాక్ష్యాధారాలతో సహా ప్రతిపక్ష నేత చెప్పిన భారత ఎన్నికల సంఘం మాత్రం రాహుల్ గాంధీపై ఒక రాజకీయ పార్టీల అనుమానాల్ని వ్యక్తం చేస్తుంది అని అన్నారు. సుమోటోగా తీసుకోవాల్సిందిపోయి, లిఖిత పూర్వక ఫిర్యాదుతో పాటు ఆధారాలు సమర్పించమంటుంది అని, ఇక్కడే ఈసీ నిబద్ధతపై దేశ ప్రజల్లో అనుమానాలు కలిగిస్తున్నాయి అన్నారు. రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ లో ఓట్ల దొంగతనానికి ఆధారాలు ఇచ్చారు, అంకెలతో సహా సాక్ష్యాధారాలను జాతిముందుంచారు అని అన్నారు. ఆధారాలు ఇవ్వడానికి వేరే మార్గం ఏమిటి దేశం మొత్తం ఓటర్ల జాబితాను స్కాన్ చేస్తూ, ఎన్నికల కమిషన్ కు ఆధారాలు ఇస్తూ ఉంటే, ఎన్నికల కమిషన్ పని ఏమిటి ఎన్నికల కమిషన్ తన బాధ్యతను నిర్వర్తించాలి అని అన్నారు. ఓ వైపు ప్రజల్లో, ప్రధాన రాజకీయ పక్షాలలో ఎన్నికల ప్రక్రియపై, అది నిర్వహించే సంస్థపై అనేక అనుమానాలు ఉన్నపుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీదే అని అన్నారు. ప్రజా సామ్య వ్యవస్థలో ఓటు అనేది చాల ముఖ్యమైనది అలాంటి ఓటుని కూడా ఈ బీజేపీ పాలనలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి కూడా లేదు అని కళ్ళకి కట్టినట్టుగా రాహుల్ గాంధీ ప్రెసెంటేషన్ ఇవ్వడం జరిగింది అన్నారు. రాజ్యాంగం గొప్ప పత్రం అయినప్పటికీ, దాని విజయం దానిని అమలు చేసే వారి ఉద్దేశాలు చర్యలపై ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ విశ్వసించారు. వారు దానిని దుర్వినియోగం చేసినా లేదా నిర్లక్ష్యం చేసినా,రాజ్యాంగం బలహీనపడవచ్చు. 1949లో రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో,రాజ్యాంగం ఎంత మంచిదైనా, దానిని అమలు చేసేవారు చెడ్డవారైతే, అది చెడ్డదే అవుతుంది, రాజ్యాంగం ఎంత చెడ్డదైనా, దానిని అమలు చేసేవారు మంచివారైతే, అది మంచిదే అవుతుంది " అని ఆయన నొక్కి చెప్పారు అని అన్నారు. ఈ దేశంలో నియంతృతంగా పరిపాలిస్తున్న భారతీయ జనతా పార్టీ విధానాలను ఎండగడుతున్నాడు అని, భారతీయ జనతా పార్టీ 11 సంవత్సరాలు వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేస్తుంటే, వ్యవస్థల్ని భ్రష్టు పట్టిస్తుంటే చూసి తట్టుకోలేక ప్రధాన ప్రతి పక్ష నాయకుడిగా ప్రశ్నిస్తున్నాడు, మిమ్మలిని ప్రశ్నిచడమే తప్పా ఇది ఏవిధంగా న్యాయం, ఇది ఏవిధంగా ధర్మం? వందకి వంద శాతం మా ఆరోపణలో నిజం ఉంది అని అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో ఎన్నికల సంఘం ఈసీ తో కలసి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు భారత దేశ పార్లమెంట్ లో ప్రధాన ప్రతి పక్ష నేతగా రాహుల్ గాంధీ ఎలక్షన్ కమిషన్ చేస్తున్న అరాచకాలమీద దేశ వ్యాప్తంగా కూడా పోరాటానికి పిలుపుని ఇచ్చారు. దీనికి మద్దతుగా మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఈ పోరాటంలో మాతో చేరండి అని అన్నారు.

# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కళాకారుల బృందం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), తేదీ:10-07-2025** ఆదివారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ మహాశక్తి దేవాలయం నందు ముందుగా కళాకారుల బృందం అమ్మవార్లను దర్శించుకుని, అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ ను తెలంగాణ ఉద్యమ కళాకారుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కండువాతో ఘనంగా సత్కరించి, లడ్డు ప్రసాదాన్ని అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి, జాతీయస్థాయి సీనియర్ నాయకులు తెల్ల మురళి మధు, ఉద్యమ కళాకారుల విభాగం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఎల్లయ్య, రంగస్థల కళాకారుల జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమ్మిరెడ్డి, జిల్లా కోశాధికారి నల్లగొని రమేష్, అసోసియేషన్ కరీంనగర్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు, శ్రీ రాజరాజేశ్వర వ్యాపారుల సంఘం అధ్యక్షులు పిన్నింటి హనుమాన్లు, మహిళా కళాకారుని సత్రం సరిత, గాయని, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఫిర్యాదిదారుల నుండి ఫిర్యాదుల స్వీకరించిన జిల్లా ఎస్పీ ఫిర్యాది సమస్యలను విని, వారి సమస్యల తక్షణ



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/సోమవారం నాడు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్,ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి,వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత యస్.హెచ్.ఓ. లకు ఫోన్ ద్వారా మాట్లాడి, వారి సమస్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడం ఎలాంటి అలసత్వం చూపరాదని, చట్టప్రకారం కేసులను పరిష్కరించాల్సిందిగా యస్.హెచ్.ఓ. లకు సూచనలు చేయడం జరిగింది,జిల్లా ప్రజలు తమ సమస్యకు పరిష్కారం దొరకని సందర్భంలో నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛంధంగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని అన్నారు,సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించేందుకు, సత్వర న్యాయం చేసేందుకు, పోలీసుశాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలసిందిగా జిల్లా ఎస్పీ సూచించారు.

## యూరియా కోసం చెప్పుల లైను

రాజన్న సిరిసిల్ల జిల్లా యూరియా కోసం చందుర్తిలో సహకార సంఘం వద్ద రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. వారం రోజులుగా తిరుగుతున్న పట్టించుకునే నాధుడు లేదని అంటున్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఒకవైపు అధికారులు ప్రకటనలు ఇస్తుంటే యూరియా కోసం రైతులు బారులు తీరడం సర్వత్రా ఆందోళన కలిగించింది. ఒకరికి ఒక బస్తా మాత్రమే ఇస్తుండడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సొసైటీల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.,

# రాజన్న ఆలయ వసతి గదలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఈవో.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానముకు సంబంధించిన భీమేశ్వర సదన్ వసతి గదుల సముదాయం, జాతర గ్రౌండ్ నందు గల గదుల విచారణ కార్యాలయం, మరియు ఇతర ధర్మశాలలో రాజన్న ఆలయ ఈవో రాధాబాయి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, అక్కడి పనితీరు పర్యవేక్షించారు.

ఇందులో భాగంగా గదులకు సంబంధించిన డైలీ కలెక్షన్ రిపోర్ట్ ( డి సి ఆర్ ), వసతి గదులకు సంబంధించిన రసీదులు, రాజన్న భక్తులకు కేటాయించిన గదుల వివరములు, ఈ టికెటింగ్ ద్వారా రసీదు జనరేట్ చేయు పద్ధతి మున్నగున్నవని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఈవో తో పాటు వసతి గదుల విభాగం సహాయ కార్యనిర్వాహణాధికారి జి. అశోక్, పరిశీలకు పి. వంశీ మోహన్, మరియు ఇతర ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు లోన్స్ పేరుతో కాల్స్ చేసి డబ్బులు కొట్టేస్తున్న 3 సైబర్ నేరస్తుల అరెస్టు. పరారీలో ఒకరు.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామానికి చెందిన పోగుల మల్లేశం ఫేస్ బుక్ లో ఇండియా బుల్స్ ధని ఫైనాన్స్ పేరుతో ఉన్న ఒక లోన్ యాడ్ ని చూసి దానిపై క్లిక్ చేయగా వెంటనే అతనికి వివిధ నెంబర్ల నుండి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి తక్కువ వడ్డీ రేటు తో మా కంపెనీలో లోన్స్ ఇస్తున్నామని మాయమాటలు చెప్పి, ముందుగా లోన్ కి ప్రాసెసింగ్ పేరిట 5,500/- ఇన్సూరెన్స్ పేరిట, మొదటి ఈఎంఐ అని చెప్పి తర్వాత లోన్ కి జీఎస్టీ చార్జీలని, తర్వాత చెక్ బుక్ చార్జీలని, తర్వాత 99% క్లియరెన్స్ చార్జీలని, ఇలా వివిధ రకాల చార్జీలు ఫీజులతో అతని వద్ద నుండి సుమారుగా 1 లక్ష 18 వేల రూపాయలను బాధితుని అకౌంట్ నుండి వారి అకౌంట్లోకి పంపించుకోవడం జరిగింది.

ఇన్ని రూపాయలు చెల్లించిన కూడా లోన్ సాంక్షన్ కాకపోవడంతో జరిగిన మోసాన్ని గ్రహించి బాధితుడు 1930 కి కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వగా అట్టి కంప్లైంట్ మీద వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎఫ్ ఐ ఆర్ నమోదు కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఎస్ఐ జునేద్, పోలీస్ సిబ్బంది సాంకేతిక ఆధారాలు ద్వారా నిందితులు, 1), నానావత్ అనిల్ నాయక్,2) బోడ రజని,3) బోడ భరత్ రాజులు, బీహార్ లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి విచారించగా వారు అక్కడ నుండి పరారై హైదరాబాద్ కి వెళ్లారని తెలుసుకొని సాంకేతిక ఆధారాల ద్వారా ఆదివారం రోజు హైదరాబాదులో అదుపులోకి తీసుకొని వేములవాడకు తీసుకురాగా, వేములవాడ రూరల్ సిఐ విచారించి అరెస్ట్ చేసి వారి దగ్గర నుండి మూడు ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

విచారణలో పై ముగ్గురు తెలిపింది ఏమనగా పాట్నాకు చెందిన లక్కీ కుమార్ అనే వ్యక్తి హైదరాబాదులో పై ముగ్గురికి పరిచయమై సులువుగా సైబర్ నేరాల ద్వారా డబ్బులు సంపాదించవచ్చు అని ఆశ చూపి తెలుగులో మాట్లాడితే త్వరగా నమ్ముతారని ఉద్దేశంతో వీరిని హైదరాబాద్ నుండి పాట్నాకు తీసు వెళ్లి ఒక రూమ్ లో వీరికి బస్సు ఏర్పాటు చేసి ఫేస్ బుక్ లో ఇండియా బుల్స్ దని ఫైనాన్స్ అనే లోనికి క్రియేట్ చేసి దానిపై క్లిక్ చేసే వారి ఫోన్ నెంబర్లను సేకరించి ఈ ముగ్గురికి అందించి వీరితో స్థానిక భాష అయిన తెలుగులో మాట్లాడిస్తూ బాధితుల నుండి ప్రాసెసింగ్ ఫీజు, చార్జీల పేరుతో, మొదటి ఈఎంఐ పేరుతో, లోన్ కి ఇన్సూరెన్స్ పేరుతో, లక్కీ కుమార్ చెప్పిన అకౌంట్లలోకి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడని, అలా వచ్చిన అమౌంట్ లో నుండి కొంత వీరికిస్తూ జల్సాలు చేస్తున్నారని తెలిపారు. వీరు ఇలా దాదాపు 30 మంది నుండి డబ్బులు కొట్టేసారని,1930 కి ఫిర్యాదుల అందాయి. ప్రజలందరూ ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని అనవసరపు మెసేజ్లు, ప్రకటనలు,వాట్సాప్, ఏపీకే ఫైల్స్ జోలికి వెళ్లవద్దని, ఒకవేళ ఏదైనా సైబర్ మోసానికి గురి అయితే 24 గంటల్లో 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సిఐ కోరారు.

# పిల్లల ఎదుగుదలకు నులిపురుగుల అడ్డు...

**1 నుండి 19 సంవత్సరాలలోపు వారందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి: నులిపురుగుల నివారణతో ఎన్నో సమస్యలు పరిష్కారం. పి.ప్రావిణ్య, జిల్లా కలెక్టర్.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే) ను పురస్కరించుకొని ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు,పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమంకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ (నేషనల్ డి వార్మింగ్ డే) కార్యక్రమానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు . నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 11వ తేదీన ( నేషనల్ డి వార్మింగ్ డే) ను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒక సంవత్సరం వయస్సు నుండి ఒక సంవత్సరం వయసు నుండి 19 వారందరికీ వయసులోపు వారందరికీ నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వైద్యులు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఈరోజు ఆగస్టు 11 జిల్లాలోని అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు విద్యాసంస్థలు అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఒకటి నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్రను చూర్ణం చేసి నీటిలో గాని పాలలో గాని కలిపి మాత్రలు వేసుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు మూడు సంవత్సరాల వారికి ఒక మాత్ర చూర్ణం చేసి నీటిలో కలిపి ఇచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు,1 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ వైద్యుల పర్యవేక్షణలోనే ఈరోజు మాత్రలు వేయనునట్లు తెలిపారు . నులిపురుల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయని వాటి నివారణ కోసం తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. నులిపురుగుల సమస్య కారణంగా ఆహారం ఎంత తీసుకున్నప్పటికీ బరువు పెరగకపోవడం, పోవడం లాంటి సమస్యలు అనేకం తలుస్తుతాయన్నారు ఈ సమస్యల నివారణ కోసం. పరిశుభ్రత చర్యలు పాటించడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడం, అన్నం తినే ముందు కాళ్లు చేతులు, శుభ్రంగా కడుక్కోవడం లాంటివి చర్యలు చేపట్టాలన్నారు. నులిపురుగుల నివారణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగులను నివారించవచ్చు అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వైద్యులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే వేసుకోవాలని ఇంటికి తీసుకెళ్తాం అని అనకుండా వైద్యుల పర్యవేక్షణలో వేసుకోవడం మంచిదన్నారు. ఈరోజు తప్పిపోయిన పిల్లలకు రేపటినుండి 19వ తేదీ వరకు అంగన్వాడి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇల్లు తిరిగి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం బోదకాలు నివారణ డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది వైద్య ఆరోగ్య సిబ్బంది ఇచ్చే మాత్రలను ప్రతి ఒక్కరు వేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు,ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి నాగ నిర్మల , ఉపాధ్యాయులు ,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు .

# కల్వకుంట్ల కవిత ది సింగరేణి కార్మికులను మోసం చేసిన 10 ఏళ్ల బహిరంగ చరిత్ర ఇప్పుడు కళ్ళలో మట్టికొట్టే కల్లబొల్లి మాటలు!

## INTUC సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్



పది సంవత్సరాలు అధికారంలో ఉండి, సింగరేణి గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షురాలిగా వ్యవహరించిన కవిత, సింగరేణిని దోచి, నాశనం చేసి, ఇప్పుడు ఇంట్లో పంచాయతీ పెట్టుకుని HMS తో పొత్తు అంటూ ప్రెస్ మీట్ పెట్టి కల్లబొల్లి మాటలు చెబితే, కార్మికులు నమ్మే పరిస్థితి లేదు.

• కవిత, మీ మాటలు మీకే సరిపోవు: సంవత్సరానికి 5 కొత్త బొగ్గు గనులు ఓపెన్ చేస్తామన్న మీరు, 10 ఏళ్లలో ఒక్క కొత్త గని కూడా ఎందుకు తెరవలేదు?

• కార్మికుని సొంత ఇంటి కల, పర్క్స్, ఇన్కమ్ టాక్స్ రద్దు చేస్తామని గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఈ హామీలు ఎందుకు నెరవేర్చలేదు? ఇప్పుడు ఎందుకు గొంతెత్తుతున్నారు?

• రాజకీయ జోక్యం: గత 10 ఏళ్లలో సింగరేణి నిధుల నుండి కార్మికుల 30 వేల కోట్లు దుర్వినియోగం చేసి, %మీూా%, మంత్రులకు 2 కోట్ల చొప్పున పంచింది TBGKS, BRS కాదా?

• ఎన్నికల్లో కార్మికుల తీర్పు: ఈ అవినీతి ఫలితమే, కోల్ బెల్ట్‌లో BRS MLA లను చిత్తుగా ఓడించారు. గుర్తులేదా?

• గుర్తింపు సంఘం పరాభవం: 10 ఏళ్లు గుర్తింపు సంఘంగా ఉన్న TBGKS , చివరి ఎన్నికల్లో పోటీ కూడా చేయలేని స్థితికి చేరింది అంటే ఆ సంఘం అవినీతి ఎంత దారుణమో కార్మికులకు బాగా తెలుసు.

• 12/3 సెటిల్మెంట్: 10 ఏళ్లలో మీ ప్రభుత్వం ఏమి చేసింది? 22 వేల కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని మీరు చెబుతారు, కానీ అసెంబ్లీలో “ఒక్క కాంట్రాక్ట్ కార్మికుడు కూడా లేడు” అని కెసిఆర్ చెప్పిన మాట మర్చిపోయారా?

• కాంగ్రెస్ ఘనత: దేశంలో ఎక్కడా లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు ?5,000 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం.

•HMS అవమానం: మొన్నటికి దాకా కేసీఆర్, కవితపై తీవ్రంగా విమర్శలు చేసిన %ఎమీూ% నేత కామ్రేడ్ రియాజ్ గారు, ఇప్పుడు కవిత కాళ్ల దగ్గర HMS ను తాకట్టు పెట్టడం కార్మికుల గౌరవానికి అవమానం.

కవితకు STPP గురించి కనీసం మాట్లాడే అర్హత హక్కే లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప సీఎం భట్టి విక్రమార్క నాయకత్వం, కార్మికుల కృషి వల్లే సింగరేణి ఎన్నడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి, లాభాలు సాధించింది.

• లాభాల వాటా: పర్మినెంట్ కార్మికులకు మాత్రమే కాదు, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది.

• భీమా రక్షణ: రూపాయి ఖర్చు లేకుండా పర్మినెంట్ కార్మికులకు ?1 కోటి ప్రమాద భీమా, కాంట్రాక్ట్ కార్మికులకు ?40 లక్షల ప్రమాద భీమా ఇది కాంగ్రెస్ ఇచ్చిన గౌరవం.

• వయో పరిమితి పెంపు: 35%-%40 ఏళ్ల వయో పరిమితి పెంపు కోసం 10 ఏళ్లు BRS మోసం చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో 2 నెలల్లోనే పెంచింది



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 11:**మన కుల బంధువు, మన సంఘ ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన పావని ప్రజాపతి గారి భర్త రవీంద్ర దర్శకుడు, నిర్మాత, అలాగే హీరోగా నటిస్తూ రాజుగాడి సవాల్ అనే సినిమాను నిర్మించారు.

ఇది ఆయన తొలి సినిమా. ఈ సినిమాను నిన్న పివిఆర్ మాల్లో ప్రదర్శించగా, మన తొలి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తన విలువైన సమయాన్ని కేటాయించి వీక్షించారు. సినిమా చాలా అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు.

మన కులంలోనే ఒక పెద్ద దర్శకుడిగా, నిర్మాతగా, హీరోగా రవీంద్ర ఎదగాలని ఆశిస్తూ ఆయనను అభినందించారు.

అంతే కాకుండా, మీ అందరూ కూడా ఈ సినిమాను థియేటర్లలో చూసి, ఆయన తొలి ప్రయత్నానికి ఆశీర్వాదం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని తెలిపారు.

# శివనామస్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వరలక్ష్మి శుక్రవారం, శనివారం రోజున రాఖీ పౌర్ణమి, ఆదివారం రోజున ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వరుస సెలవులు మరియు పండుగలు కావడంతో సోమవారం రోజున వేములవాడ లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తినారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు వేకువజాము నుండి పవిత్ర ధర్మగుండంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారికి మొక్కులు చెల్లించుకొని, తదనంతరం కోడమొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న భక్తులు గండ దీపంలో నూనె పోసి గండ దీపం వెలిగించి తమ గండాలు తొలగించాలని స్వామివారిని వేడుకున్నారు. భారీ సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి తమ సౌభాగ్యాన్ని కాపాడాలని ఆ బాల త్రిపుర సుందరీ దేవిని అర్జించారు. రాజన్న ఆలయానికి భారీ సంఖ్యలో చేరుకున్న భక్తులచే ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారినాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఉద్యోగులు తగు ఏర్పాటుచేసినరు.

# అందోల్ - జోగిపేట మున్సిపాలిటీలో పరిశుద్ధ లోపం

## ప్రబలుతున్న డెంగు జ్వరాలు

## డెంగ్యూ జ్వరం చిన్నారిని కబలించింది



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా: అందోల్ - జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలో, పారిశుధ్య లోపం కరువై, సీజనల్ వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారు, జోగిపేట పట్టణానికి చెందిన కుమ్మరి భాస్కర్, మధుమతిల కుమార్తె యశస్విని,( 12) కి ఇటీవల జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు, రెండు రోజులుగా జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన చిన్నారికి జ్వరం ఎంతకి తగ్గకపోవడంతో, వైద్యులు రక్తపరీక్ష చేయగా డెంగ్యూ అని తేలింది, మెరుగైన చికిత్స కోసం వైద్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి రేపర్ చేశారు, అక్కడి వైద్యులు చిన్నారి యశస్వినికి, వైద్య పరీక్షలు నిర్వహించారు, ఆ రిపోర్టులో చిన్నారికి డెంగ్యూ సోకినట్లు నిర్ధారించారు,ప్లేట్ లెవెల్స్ కూడా పడిపోవడంతో ఈ క్రమంలోనే చిన్నారి పరిస్థితి విషమిస్తుండడంతో, చేసేది లేక సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, (నీలోఫర్ )కు రేపర్ చేశారు, దీంతో యశస్విని కుటుంబ సభ్యులు,హుటాహుటిన హైదరాబాదులోని (నిలోఫర్) చిల్డ్రన్స్ ఆసుపత్రికి తరలించారు, అప్పటికే చిన్నారి యశస్విని, శ్వాస ఇబ్బందితో బాధపడుతున్న చిన్నారిని ఐసియుకు తరలించి, చికిత్స అందిస్తున్న తరుణంలోనే, తెల్లవారుజామున చిన్నారి తుది శ్వాస విడిచింది , అల్లారుముద్దుగా పెరిగిన చిన్నారి కళ్ళముందే మృత్యువాత పడడంతో, ఆమె తల్లిదండ్రులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు, దీంతో జోగిపేట పట్టణంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి, గత నాలుగు రోజుల క్రితం జోగిపేట పట్టణానికి చెందిన చిన్నారి పిట్ల నవ్య శ్రీ, పాము కాటు ఘటనతో మృతి చెందిన సంఘటన మరువక ముందే, మరో చిన్నారి డెంగ్యూ జ్వరంతో మృతి చెందడం జోగిపేట పట్టణంలో కలకలం రేపింది,అందోల్ - జోగిపేట మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో, పట్టణంలోని పారిశుద్ధం అస్తవ్యస్తంగా మారిందని, స్థానికులు మండిపడుతున్నారు, ప్రతి వార్డులో ఎటు చూసినా చెత్తాచెదారంతో పాటు ముళ్ళపొదలు దర్శనమిస్తున్నాయని, కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, దీంతో పట్టణంలో విష సర్పాలు, దోమల బెడద,తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు, పారిశుద్ధ నిర్వహణకు మునిసిపాలిటీ అధికారులకు, పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, పట్టణ ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు, అందోల్ - జోగిపేట మున్సిపాలిటీలో 100, రోజుల యాక్షన్ ప్రణాళిక అంటూ మునిసిపల్ అధికారులు అంగు ఆర్భాటం చేశారే తప్ప, ఆచరణలో పరిశుద్ధాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు

# మంత్రి రాజనర్సింహ ఆదేశానుసారంతో ఆర్థిక సహాయం

## యాక్సిడెంట్లో కాలు విరిగిన జెల్ల బాగయ్య అందోల్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు11(ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ కుమ్మరిగూడెం 6, వార్డుకు చెందిన జెల్ల బాగయ్య, ఆగస్టు రెండో తేదీన యాక్సిడెంట్లో ఎడమకాలు విరిగిపోయింది, హైదరాబాదులో హాస్పిటల్ లో ఆపరేషన్ చేయించుకుని, తిరిగి తన సొంత ఇంటికి వచ్చాడని తెలుసుకొని, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారంతో జెల్ల బాగయ్య, కు (10.000 ) వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన మాజీ కౌన్సిలర్ తిరుమల హరికృష్ణగౌడ్, ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ రొయ్యల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎలాగోరి సత్యం, నసీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు,జెల్ల బాగయ్య, కుటుంబ సభ్యులు, మంత్రి దామోదర్ రాజనర్సింహకు, మాజీ కౌన్సిలర్ హరికృష్ణగౌడ్ కు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...

# మహాత్మ జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ కలెక్టర్ తనిఖీ



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆగస్టు 11:**సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన మార్గనిర్దేశాన్ని, మెటిరియల్ ను అందించడమే కాకుండా, ఎప్పుడైన సరే అందుబాటులో ఉంటూ మీకు కావలసిన సలహా, సూచనలను అందిస్తానని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి తన మెయిల్ ఐడిని విద్యార్థులకు తెలియజేసారు.

సోమవారం కీసర మండలం అంకిరెడ్డి పల్లిలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ లకు నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులు గౌరవ వందనంతో కలెక్టరుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్కూల్, కాలేజీ స్ట్రేంత్ ఎంత మంది విద్యార్థులున్నారని, బిల్డింగ్ అద్దె ఎంత చెల్లిస్తున్నారని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ వివరాలు తెలుపుతూ యజమాని అద్దె పెంచాలని అడుగుతున్నారని, వాడుకునేందుకు నీరు సరిపోవడం లేదని, ఒక బోరు వేయించాలని, అదే విధంగా చిన్న చిన్న మరమ్మత్తులు ఉన్నాయని కలెక్టరుకు వివరించారు. కలెక్టరు స్పందిస్తూ ఎస్టిమేషన్ నివేదికలను తనకు పంపాలని సూచించారు. ఎంఈసి సెకండ్ ఇయర్ తరగతి విద్యార్థులతో కలెక్టరు మాట్లాడుతూ గణితం, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల పై వారికి భోధించారు. స్టాక్ మార్కెట్ బ్యాంకింగ్, షేర్స్, టెక్నాలజీ అనాలసిస్, ఫండమెంటల్ అనాలసిస్ వంటి అంశాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మీరు శ్రద్దగా బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మీకు ఉద్యోగ పరంగా గాని, వ్యాపార పరంగా గాని అవసరమైన సహాయాన్ని తప్పకుండా అందిస్తానని కలెక్టరు విద్యార్థులకు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు కలెక్టర్ తెలిపారు. మీరు భవిష్యత్తులో ఎక్కడైన ఇంటర్వ్యూలకు వెళితే సబ్జెక్టు పై పూర్తి విషయ పరిజ్ఞానంతో ఎటువంటి ప్రశ్నలకైన సమాధానమిచ్చే విధంగా సంసిద్దమై వెళ్లాలని విద్యార్థులకు కలెక్టరు సూచించారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న%శీ%, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తూన్నారా అని ఆరా తీశారు. అనంతరం స్టోర్ లోని వంట సామాగ్రిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కీసర ఎం ఆర్ఓ అశోక్, ప్రిన్సిపల్ రాజమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పాలస్తీనా ర్యాలీపై బీజేపీ ఆగ్రహం

జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్.
మానవత్వం కాదు మత–ఓటు రాజకీయాలే .
పిల్లలను ర్యాలీల్లో వాడటం జాతీయ జెండాకు అవమానం
మత రాజకీయాలకు చివరి హెచ్చరిక బీజేపీ జిల్లా అధ్యక్షులు
నెల్లూరి కోటేశ్వరరావు ఘాటు వ్యాఖ్యలు







**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం)** ఖమ్మం పాలస్తీనా సంఘీభావం పేరుతో ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీపై బీజేపీ ఘాటుగా స్పందించింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో భాజపా నేతలు సోమవారం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు సమర్పించారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులను అనుమతి లేకుండా పాల్గొనిపించడం, జాతీయ జెండాతో పాటు విదేశీ జెండాలను ఊపించడం, మతపరమైన భావజాలాన్ని పిల్లల మదిలో నింపే ప్రయత్నం చేయడం దేశ హితానికి విరుద్ధమని, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కలెక్టర్కు అందజేసిన ఫిర్యాదులో, ఇటీవల జరిగిన ర్యాలీకి సంబంధించిన అన్ని సంఘటనలను బీజేపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, మానవత్వం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు ఆడటాన్ని ఖమ్మం ప్రజలు ఇక సహించబోరని హెచ్చరించారు. గాజా కోసం, పాలస్తీనా కోసం మీరు రోడ్లపై వేల ర్యాలీలు చేస్తారని, కానీ ఖమ్మం ప్రజల బాధలకు మాత్రం ఎప్పుడూ మౌనం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

2023లో కాల్వట్టులో జరిగిన దారుణాన్ని గుర్తు చేస్తూ, ఒక హిందూ యువకుడిని ముస్లిం దుండగులు పెట్రోల్ పోసి మంటగలిపి హతమార్చిన సంఘటనపై ఒక్క స్పందన కూడా రాలేదని, రెండు నెలల క్రితం రైల్వే స్టేషన్ వద్ద 50 మంది ముస్లిం యువకులు టీ స్టాల్ యజమానిపై దాడి చేసినప్పుడు కూడా ఎటువంటి ఆందోళన కనిపించలేదని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో గాజా కోసం రాత్రింబగళ్లు ర్యాలీలు, ప్రెస్ మీట్లు, మీడియా కవరేజీలు నిర్వహించగలిగితే, ఇక్కడి ప్రజల బాధలపై మౌనం ఎందుకు అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు సాయి గణేష్ నగర్ లవ్ జిహాద్ కేసు తుమ్మలగడ్డలో మహిళలపై బెదిరింపులు నరసింహా స్వామి ఆలయంలో దళిత మహిళపై వేధింపులు, ముష్టికుంట, కోడుమూరులో హిందూ మహిళలపై గంజాయి దాడులు %-% ఈ అన్నీ జరిగినా కూడా, మానవత్వం పేరుతో గొంతు విప్పిన వారంతా మౌనమే వహించారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ సైనికుల త్యాగాలను గుర్తు చేసే ఆపరేషన్ సింధూరు విజయోత్సవ ర్యాలీలో కూడా ఈ నేతలు కనబడకపోవడం వారి అసలు మనసును బహిర్గతం చేస్తోందని వ్యాఖ్యానించారు కాశ్మీర్లో మతం పేరుతో 27 మంది హిందువులను ఉగ్రవాదులు హతమార్చిన ఘటనపై కూడా ఈ నాయకులు నోరు విప్పకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కోటేశ్వరరావు పేర్కొన్నారు. పాకిస్తాన్కు మద్దతు ఇచ్చే పాలస్తీనాను సమర్థిస్తూ, మన దేశానికి సహాయం చేసిన ఇజ్రాయిల్ను విమర్శించడం దేశభక్తి కాదని ఆయన ఎద్దేవా చేశారు ర్యాలీలో పాఠశాల విద్యార్థులను కిలోమీటర్ల తరబడి నడిపించడం, జాతీయ జెండాకు సమానంగా విదేశీ జెండాలను పట్టించడం, పిల్లలకు వేషధారణలు చేయించడం దేశ ప్రతిష్ఠకు మచ్చగించడమేనని ఆయన ఆరోపించారు. ముస్లిం ఓటు బ్యాంకును కాపాడేందుకు హిందూ బాధలపై మౌనం వహించే ఈ రాజకీయ మోసాన్ని ప్రజలు బహిర్గతం చేస్తున్నారని స్పష్టం చేశారు మతం చూసి మానవత్వం అమ్ముకునే ఈ మాయాజాలం ఇక చెల్లదని, జాతీయ సమస్యలపై మౌనం పాటిస్తూ, గాజా కోసం గొంతు విప్పడం ప్రజలతో మోసం చేయడమేనని ఆయన ఘాటు హెచ్చరిక జారీ చేశారు. అనంతరం ఖమ్మం నగర ఎసిపి రమణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటేల విద్యాసాగర్, సన్నీ ఉదయ ప్రతాప్, దేవకి వాసుదేవరావు, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, మందడపు సుబ్బారావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు,ఆర్ వి ఎస్ యాదవ్, ఈదుల భద్రం వేల్పుల సుధాకర్, రజినీ రెడ్డి శ్రీరామనేనిమణి, తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండలం సంగమల్లయ్యపల్లె గ్రామానికి చెందిన ఎం. వెంకటేశం తన ఇల్లు కూలిపోయినందున రికార్డుల నుండి ఇంటి నెంబర్ తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి పట్టణానికి చెందిన దుర్గం మోహన్ తాను నెన్నెల మండలం నెన్నెల శివారులో కొనుగోలు చేసిన భూమికి తన పేరిట పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన చింతం నారాయణ తనకు బట్వాన్ పల్లి శివారులో గల భూమికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని కోరుతూ అర్జీ సమర్పించారు.భీమారం మండలం సుంకరిపల్లి కాలనీకి చెందిన దుర్గం భాగ్య దినసరి కూలీ అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మాల మహానాడు ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రభుత్వం తీసుకువచ్చిన షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు.ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం శ్రీరాంపూర్ శాఖ ప్రతినిధులు తమ దరఖాస్తులో శ్రీరాంపూర్ ప్రాంతంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. మంచిర్యాల పట్టణంలోని 10,28 వార్డులో గల మారుతీ నగర్ రోడ్ నం.2 కాలనీవాసులు తమ ప్రాంతంలో గల హనుమాన్ మందిర్ వెనుక నాలా వంకరగా ఉండడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తుందని,నాలాను ఎలాంటి వంకలు లేకుండా సరిచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన కోట మల్లయ్య తాను గత 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇల్లు వేరొకరి పేరిట మార్పు జరిగిందని,ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.నస్పూర్ మండలం ఆర్ కె 6, కృష్ణ కాలనీకి చెందిన హరీష్ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్ కె 6 లో గల సి టైప్ క్వార్టర్లకు సంబంధించి మురుగునీటి సెప్టిక్ ట్యాంక్ పగిలిన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధి సికిందర్ తన దరఖాస్తులో చెన్నూర్ లో షెడ్యూల్డ్ కులాల కళాశాల,బాలుర వసతి గృహం,బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన మామిడి రాజశేఖర్ దివ్యాంగుడు అయిన తాను ఇంటర్ పూర్తి చేసి ఎం.ఎల్. టి.1 సంవత్సరం శిక్షణ పొందానని,తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.హాజీపూర్ మండలం గుడి పేట గ్రామానికి చెందిన ఎంబడి జ్యోతి తన భర్త చనిపోయాడని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని,ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తన దరఖాస్తులో నస్పూర్ శివారులో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ రీడర్ల ఆదాయం పెంచినందుకు ప్రభుత్వానికి యాజమాన్యానికి ధన్యవాదాలు

### తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు





**NORTHERN POsWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED**
**CORPORATE OFFICE :: WARANGAL**

**Memo.No.CMD/NPDCL/Dir(F)/CGM(F)/GM(R)/SAO(R)/AAO(R)/D.No.594/25, Dt:06/08/2025.**

**Sub: -** TGNPDCL – Utilization of services of Spot Billers for various operational works after completion of Spot Billing – Instructions Issued.

* * *

Some of the Field Officers are requesting for utilization of services of Spot Billing Operators at Section Offices for various works. The Employee unions have also represented for the same on the pretext of existing O&M staff are over burdened due to various operational works and shortage of staff.

2. After careful examination of the above proposal, it is decided to engage the services of Spot billers for a period of 12 days i.e., from 18th to 29th after completion of Spot billing, for the works indicated below:

a. For Change of Stuckup and Burnt meters.
b. For Sealing of meters.
c. For inspection of services for improvement of revenue as below:
i) Inspection of Wrong Category suspected during spot billing.
ii) Inspection of Category-1 Common Services.
iii) Inspection of Category-2 Multiple Services under same premises.
iv) Inspection of RMD Exceeded CMD Services.
v) Inspection of Category-2 Services Released in Muncipality or Corporation area after 01-JUL-2023 suspected to be used for Construction Activity.
vi) Inspection of Category-2, 3 Private Services running under live status without payment from (03) months.
vii) Inspection of Category-1 Non-Gruhajyothi Services where average consumption is above 200 units running under live status and not paid bills from (03) months.
viii) Inspection of Non-KVAH Scs for levy of Capacitor surcharge (Cat-II & III).
ix) Identification of Services indulging in theft/malpractice.
x) Identification of unmetered services and efforts to regularise of same.
xi) Identification of poles utilized by Broad band operators for billing pole penalties.
xii) Replacement of Non IRDA meters with IRDA meters.
xiii) Shifting of meters from inside to outside of the house.
xiv) And any other parameters notified from time to time.

d. The daily performance targets for the Spot billers engaged for above works is to be fixed as follows:
i) Replacement of minimum (8) meter stuckup 'or' meter burnt 'or' Replacement of Non IRDA meters with IRDA meters 'or' shifiting of meters from inside to outside of the houses per day.
'Or'
ii) Sealing of (86) meters per day (minimum).
'Or'
iii) Inspection of (86) services per day (minimum).

**Contd..2**

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం)** ఖమ్మం విద్యుత్ మీటర్ రీడర్లకు ఆదాయాన్ని పెంచినందుకు ప్రభుత్వానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్. సిఐటియు అనుబంధ కార్మిక సంఘం. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ప్రసాద్ జిల్లా అధ్యక్షులు బి. పుష్పరాణి ,కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్ .దొడ్డ వెంకటేశ్వర్లు గత అనేక సంవత్సరాలుగా విద్యుత్ శాఖను నమ్ముకొని శాఖలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్లకు జీతాలు పెంచినందుకు ధన్యవాదాలు తెలియ పరచిన్నారు గత ప్రభుత్వం అనేక మారులు దరఖాస్తులు అందజేసిన ఎలాంటి జీతాలు పెంచలేదని కరోనా సమయములలో, ఎండ ,వానల సందర్భములోనూ ఎలాంటి అదనపు అవకాశాలు కల్పించలేదని మరణించినా ఆస్పటల్ పాలైన గాని ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని తెలియపరిస్తున్నారు యూనియన్ అనేక ధర్నాలు, పోరాటాలు, వినతి పత్రాలు సమర్పించిన ఫలితంగా స్పందించిన యాజమాన్యం ఇప్పుడు జీతాలు జీవో విడుదల చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపినారు. రేపు స్పాట్ మీటర్ల వచ్చినా వీరీ ఉపాధికి ఎలాంటి లోటు లేకుండా చేయాలని తెలియజేసినారు , వీరిని కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని తెలియపరిచినారు ఇప్పటికే వయసు మీరీ ,అనారోగ్యాల పాలై కష్ట పడి ఉద్యోగాలు చేస్తున్నారని తెలియపరిచారు . విద్యుత్తు రీడింగులు తీయడం అనేది చాలా కీలకమని వీరు ద్వారా విద్యుత్ శాఖకు చాలా ఉపయోగాలు ఉన్నాయని వీరి ద్వారా ప్రధానంగా రెవిన్యూ వసూలు పెరుగుతాయని కావున వీరిని ఆర్టిజన్ గా గుర్తించాలని తెలియపరిచినారు వీరితో పాటు పీసు రేటు కార్మికులుగా ఉన్న ప్రైవేటు బిల్లు కలెక్టర్లు, ఎస్బిఎం ,స్టోర్, అన్ మాన్ కార్మికులనూ ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేసినారు. వీరికి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసినారు .లేనిపక్షంలో రాబోయే రోజులలో ఈ కార్మికులతో కలిసి ఆందోళనలు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలియపరిచినారు

## టీఎన్జీవో ప్లాట్ల లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్టు 11 :** మంచిర్యాల జిల్లా నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42 లో గల టీఎన్జీవో ప్లాట్ల లో జరుగుతున్న అవకతవకలపై మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయా అని ప్రశ్నించారు.గూడు కోసం గుడిసె వేసుకుంటే హుటాహుటిన తొలగించే ప్రభుత్వ అధికారులు,జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న టీఎన్జీవో కాలనీలో జరుగుతున్న అవకతవకలు అక్రమ నిర్మాణాలపై ఆక్రమణలపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు,నస్పూర్ శివారులో గల 42 సర్వే నంబర్ లో టీఎన్జీవో ప్లాట్ల లేక రియల్ ఎస్టేట్ వెంచర్ అని సందేహం కలుగుతుందన్నారు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు.వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనియెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు మొదలు పెడతామన్నారు బహుజన సమాజ్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్,జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు,నాయకులు జాడి ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరుపు లేని వర్షానికి కుళ్లిపోతున్న పంట మొక్కలు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా:మర్పల్లి/మండలంలోని గ్రామాలలో ఎడతెగని వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల నీరు అధికంగా ప్రవహించడం వల్ల పంట మొక్కలు కుళ్లిపోతునాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అవసరం ఉన్నప్పుడు అడిగినా పడని వర్షం అవసరం లేనప్పుడు ఆగమన్న ఆగదు ఏది ఏమైనా రైతులకు ఉన్న కష్టాలు చెప్పుకోలేనంత,ఇప్పటికైనా వరుణుడు రైతు బాధ చూసి కనికరించలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూం ఇళ్ళ నివాసితులు ధర్నా.

హైదరాబాద్ జీహెచ్ఎంసి ప్రధానార్యాలయం ముందు అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూం ఇళ్ళ నివాసితులు ధర్నాకు దిగారు. కార్యాయంల గేటు ముందు బైఠాయించారు. తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కు వసతులు కల్పించాలని డిమాండ్. చేసారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

## నులిపురుగుల నిర్మూలన దిశగా సమిష్టిగా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా మంచిర్యాల ఆగస్టు 11** : నులి పురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారిఎస్.యాదయ్య,జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్,ఉప వైద్యాధికారి డా.అనిత లతో కలిసి హాజరై విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను తినిపించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యం కొరకు అందరూ కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 58 వేల 480 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని,1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ మాత్రలను తినిపించడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని 930 అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో పిల్లలందరికీ మాత్రలు అందించడం జరుగుతుందని,వైద్య ఆరోగ్య, విద్య,సంక్షేమ శాఖలు,మున్సిపల్, గ్రామపంచాయతీ ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. నులి పురుగుల నిర్మూలనతో రక్తహీనత తగ్గి పిల్లలను పోషణ మెరుగుపడుతుందని, మానసిక,శారీరక అభివృద్ధి జరిగి అభ్యాసన సామర్థ్యం, పాఠశాలలో హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు.పిల్లలందరికీ మాత్రలు తినిపించాలని,1-3 వయసుగల పిల్లలకు సగం మాత్ర చూర్ణం చేసి నీటితో ఇవ్వాలని, 3 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఒక మాత్రను చప్పరించి తీసుకోమని చెప్పాలని, పరిశుభ్రమైన నీటిని త్రాగించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రపరుచుకోవాలని తెలిపారు.పాదరక్షలు లేకుండా ఆటలు ఆడడం,బహిరంగ మలవిసర్జన,మురికి చేతులు కారణంగా నులిపురుగుల అభివృద్ధి జరిగి రక్తహీనత,ఆకలి లేకపోవడం ఇతర వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది పిల్లలందరికీ మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా.ఎ. ప్రసాద్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య, వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలేపల్లి రాజీవ్ స్వగృహ భవన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్సీ తో సందర్శించిన టీఎన్జీవో నాయకులు



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి లోని రాజీవ్ స్వగృహ భవన సముదాయాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో పాటు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్సీ భాస్కర్ రెడ్డి ఈ ఈ నరేందర్ రెడ్డి ఖమ్మం జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మరియు ఖమ్మం జిల్లా కి సంబంధించిన బిల్డర్స్ సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా ఉద్యోగస్తులకి ఈ గేటెడ్ కమ్యూనిటీని అందుబాటులోకి తీసుకురావడానికి ఉద్యోగ సంఘాలు చేస్తున్న కృషి ని కలెక్టర్ గారు అభినందించడం జరిగింది.త్వరలో మున్నేరు రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని, తద్వారా ఖమ్మం నగరానికి పడమర భాగం లో ఉన్న ఏదులాపురం మున్సిపాలిటి అత్యంత వేగం గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ భవన సముదాయంనకు 60 ఫీట్ల రోడ్డు మంజూరు అయిందని పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ ప్రాజెక్ట్ దక్కించుకున్నాక ప్రభుత్వ ఉద్యోగులు ఏర్పాటు చేసుకొనే గేటెడ్ కమ్యూనిటీ నమూనా బ్రోచర్ ని అందుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.పూర్తి వివరాలతో బ్రోచర్ని రూపొందించినందుకు అభినందించారు.



## డిగ్రీ కోసం ఎం జె పి లో చేర విద్యార్థులకు చివరి అవకాశం



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్టు 11 :** మహాత్మ జ్యోతిబాపూలే(పురుషుల) డిగ్రీ కళాశాల 2025-2026 విద్యాసంవత్సరానికి మంచిర్యాల కాలేజ్ రోడ్ లోగల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలోఅడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైం దని ఇంటర్మీడియట్ మార్కులను బట్టి అర్హత గల విద్యార్థులు ఆగస్టు 14వ తేదీ వరకు అప్లై చేసుకోవాలన్నారు.

వివిధ కోర్సులలో ఉన్న ఖాళీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని,ఇదే చివరి అవకాశం అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్.సి.ఓ.సేరు శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉచిత భోజనం,హాస్టల్ వసతితో పాటు, యూనిఫామ్,టెక్స్ట్ బుక్,నోట్ బుక్స్, షూస్,ట్రాక్ షూట్, బెడ్ షీట్స్ అందజేస్తామని తెలిపారు.అలాగే అధునాతన సౌకర్యాలతో తరగతి గదులు,కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కలదు.నిపుణులైన అధ్యాపకులతో విద్యా బోధన,గ్రూప్ 1,గ్రూప్ 2, గ్రూప్ 3 %డ% 4,బ్యాంకింగ్, ఆర్ ఆర్ బి,ఎస్ ఎస్ సి,ఎస్సై కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేకమైన కోచింగ్ అందించడం జరుగుతుందన్నారు. కెరియర్ గైడెన్స్ కోసం టి ఏ ఎస్ కె వంటి సంస్థల సహకారంతో బోధన తరగతులు, ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొనడం,వారాంతంలో వినోద కార్యక్రమాల వీక్షణం,హెల్త్ సూపర్ వైజర్ పర్యవేక్షణలో ప్రతిరోజు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ,24 గంటల అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు,వివిధ కోర్సుల అకాడమిక్ పుస్తకాలతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన లైబ్రరీ సదుపాయం తోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థులను తీర్చిదిద్దడం వంటి సదుపాయాలు కలవన్నారు.మరింత సమాచారం కోసం 9603705803, 9137381807 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణి' కి 150 విన్నపాలు

హైదరాబాద్, ఆగస్ట్ 11, 2025: సోమవారం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి' కి మొత్తం 150 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు మొత్తం 60 విన్నపాలు రాగా, జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 90 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 39, సికింద్రాబాద్ జోన్ 13 , శేరిలింగంపల్లి జోన్ లో 10, ఎల్బీనగర్ జోన్ 11, చార్మినార్ జోన్ లలో 8 , ఖైరతాబాద్ జోన్ లో 9 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన జిహెచ్ఎంసి అధికారులు సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు.జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆడిషన్ కమిషనర్లు మంగతాయారు,ేణుగోపాల్, పంకజ, గీత రాధిక సి సి పి శ్రీనివాస్,అడిషనల్ సి సీపీ గంగాధర్ ప్రదీప్ , చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, డైరెక్టర్ యు బి డి వెంకటేశ్వర్ రావు,, ఇరిగేషన్ సి ఈ నిత్యానందం, ఎలెక్ట్రిసిటీ ఈ ఈ మమత, డిప్యూటీ సి ఈ ప్రాజెక్టు సంపద, డిప్యూటీ సి ఈ పనస రెడ్డి, ఎస్ ఈ ఎస్ ఎన్ డి పి పి వి రావు, హౌసింగ్ ఈ ఈ లు పి వి రవీందర్, రాజేశ్వర్ రావు,డిప్యూటీ ఈ ఈ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13,14న ఖమ్మం లో జరిగే యాదవుల రేజంగ్ లా రజ కలశ యాత్రను జయప్రదం చేయండి

### అఖిలభారత యాదవ మహాసభ నాయకులు మల్లిబాబు యాదవ్ వెంకట నరసయ్య సింహాద్రి యాదవ్




**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం)** ఖమ్మం ఈనెల 13,14న ఖమ్మంజిల్లాలో అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టనున్న యాదవ రేజంగ్ లా రాజ్ కలశ యాత్రను రాజకీయాలు వర్గాలకతీతంగా యాదవులు పాల్గొని ఈ యాత్రను జయప్రదం చేయవలసిందిగా జిల్లా యాదవుల ను ఉద్దేశించి అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, యాదవ యువజన జిల్లా అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ సోమవారం నాడు ఖమ్మం స్థానిక కృష్ణ ఫంక్షన్ హాల్ లో యాదవ రేజింగ్ లా కలశ యాత్ర ను గురించి చర్చించడానికి యాదవ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ 1962 భారత్ చైనా యుద్ధంలో అమరవీరులైన అహిర్ (యాదవ) రెజిమెంట్ కు సంబంధించిన 114 మంది యాదవ వీరుల ప్రాణ త్యాగాలను ఈ దేశం నిర్లక్ష్యం చేసి మరిచిపోయిందని, ఎంతో దేశభక్తితో చైనా ను మన భారతదేశంలోని భూభాగాన్ని ఆక్రమించకుండా అడ్డుకున్న యాదవ రెజిమెంట్ ను రద్దు చేయడం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. యాదవ వీరుల స్మృత్యర్థం అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యాదవ రెజింగ్ లా కలశ యాత్ర ను చేపట్టడం జరిగిందని, దానిలో భాగంగా మన ఖమ్మం జిల్లాకు ఈనెల13న చేరుకుంటుందని, 14వ తేదీ గురువారం నాడు ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్, మయూరి సెంటర్ నుండి మహబూబాబాద్ వరకు జిల్లాలో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొరిమేకల కోటయ్య, పొదిల సతీష్, బమ్మిడి శ్రీనివాస్, సత్తి వెంకన్న, బొల్లి కొమరయ్య, మొరిమేకల అమరయ్య, చెవుల ఖాదర్ బాబా, తుప్పాతి రవికుమార్, తెల్లబోయిన రమణ, వాకధాని కోటేశ్వరరావు తొడేటి లింగరాజు, మేడుదుల మల్లేష్, పొదిల భూపతి, పొదిల తిరుపతిరావు ప్రవీణ్ యాదవ్ తదితర యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు

## అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి పి నాలా లో పడ్డ డెలివరీ బాయ్

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

రంగారెడ్డి మహేశ్వరం నియోజవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని గాయత్రి నగర్ అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి(ాఔఆఖ) నాలా లో జొమాటో డెలివరీ బాయ్ పడిపోయాడు. శనివారం రాత్రి గాయత్రి నగర్ ఎక్స్ రోడ్ నుండి టి కే ఆర్ కమాన్ వద్దకు సర్వీస్ రోడ్డులో వెళుతుండగా అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి పి(ాఔఆఖ)నాలాలో డెలివరీ బాయ్ ఫరాన్(25) బైక్ తో సహా పడిపోయాడు. స్థానికంగా ఉన్న షాప్ నిర్వాహకులు పడిపోయిన వ్యక్తిని గమనించి ప్రాణాలతో బయటికి తీశారు, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులు వచ్చి పూడికలు తీసి వెళుతున్నారు కానీ శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయడం లేదని స్థానికులు తెలిపారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com